ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

శుక్రవారం 7 ఫిబ్రవరి 2025



అమృత్ 2.0 ఆమోదం



నరసరావుపేటలో అభివృద్ధి చేయనున్న కత్తవ చెరువు

పురాల్లో పట్టాలెక్కనున్న పనులు

అమృత్ 2.0 ఆమోదంతో మున్సిపాలిటీల్లో శాశ్వతంగా తాగునీటి సమస్య తీరనున్నది. ఈ పథకం కింద తాగునీటి పథకాల విస్తరణ, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం, తాగునీటి చెరువుల అభివృద్ధి తదితర పనులు చేపట్టనున్నారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పురాల్లో అమృత్ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ పనులను కూడా అమృత్ 2.0లో చేర్చారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాల్టీలలో నిలిచిపోయిన పనులు చేపట్టేందుకు తాజాగా వ్యయ అంచనాలను అధికారులు రూపొందించారు. రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ ఆ డీపీఆర్‌లను బుధవారం ఆమోదించింది. దీంతో అమృత్ పనులు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. మున్సిపాల్టీలలో తాగునీటి పథకాలను పూర్తిస్థాయిలో విస్తరించి నూరు శాతం గృహాలకు కుళాయిల ద్వారా సురక్షితమైన తాగునీరు ఇచ్చే దిశగా పనులు చేపట్టనున్నారు.

- రూ.964.31 కోట్లతో ప్రణాళికలు సిద్ధం
- కేంద్రం నుంచి 50 శాతం నిధులు మంజూరు
- వైసీపీ హయాంలో నిలిచిపోయిన పనులకు మోక్షం
- రాష్ట్ర ప్రభుత్వ, మున్సిపల్ వాటాగా ఆర్థిక సంఘం నిధులు
- పురపాలక సంఘాల్లో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం



నరసరావుపేటలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మున్సిపల్ కేంద్రాల్లో ప్రజల తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు అమృత్ 2.0 పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అమృత్ పనులకు ఆమోదంతో మున్సిపాల్టీలకు మహర్దశ పట్టనుంది. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపాల్టీలు దామాషా ప్రకారం అమృత్ పనులకు నిధులు సమకూరనున్నాయి. దాదాపు రూ.964.31 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రణాళికలు కూడా సిద్ధమయ్యాయి. కేంద్రం వాటా కింద 50 శాతం నిధులు మంజూరయ్యాయి. మున్సిపల్ పట్టణాల్లోని ప్రతి ఇంటికి నీటి కూళాయి కనెక్షన్ ఇవ్వాలని, సురక్షితమైన తాగునీరు అందించాలన్నది అమృత్ లక్ష్యం. అయితే గత వైసీపీ ఐదేళ్ల పాలనలో అమృత్ లక్ష్యం నీరుగారిపోయింది. వైసీపీ ప్రభుత్వం తన వాటా నిధులు ఇవ్వకపోవడంతో పాటు కేంద్రం విడుదల చేసిన నిధులను ఇతర అవసరాలకు మళ్లించుకుంది. దీంతో అమృత్ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ క్రమంలో తాజాగా అమృత్ పనులకు ఆమోదంతో పురాల్లో పనులు త్వరితగతిన చేపట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. అమృత్-1 పథకంలో నిలిచిపోయిన పనులను కూడా కొన్నింటిని అమృత్ 2.0లో చేర్చారు. అమృత్ పనులకు నిధుల భారం రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపాల్టీలపై పడకుండా కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం

(మిగతా 8వ పేజీలో)

వ్యయం అంచనా వివరాలు

మున్సిపాల్టీ	వ్యయం (రూ.కోట్లలో)
పల్నాడు జిల్లా..	
నరసరావుపేట	29.42
చిలకలూరిపేట	160.90
వినుకొండ	29.57
దాచేపల్లి	8.61
పిడుగురాళ్ల	36.29
గురజాల	5.27
మాచర్ల	43.43
సత్తెనపల్లి	0.72
గుంటూరు జిల్లా..	
గుంటూరుకార్పొరేషన్	381.12
మంగళగిరి-తాడేపల్లి	76.43
తెనాలి	61.61
పొన్నూరు	22.10
బాపట్ల జిల్లా..	
చీరాల	32.68
బాపట్ల	25.32
రేపల్లే	45.74
అద్దంకి	5.10

నామినేషన్లకు ఇక రెండు రోజులే

- నేడు, 10 తేదీల్లో మాత్రమే అవకాశం
- 8, 9 తేదీల్లో రెండో శని, ఆదివారం సెలవుదినాలు

8

దూరవిద్య పీజీ ఫలితాలు విడుదల

6

సీఈవో మాకొద్దు

◆ జిల్లా పరిషత్‌ను భ్రష్టుపట్టించారు ◆ పంచాయతీ రాజ్ మంత్రి, కమిషనర్‌కు లేఖ రాసిన జడ్పీ చైర్‌పర్సన్

పీడీ ఫైల్.. పెండింగ్

నెలరోజులుగా కలెక్టర్ వద్దే

వీరు సమాజానికి అత్యంత ప్రమాదకారులు

శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందని పోలీసుల అంచనా

గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వారు కరుడుగట్టిన నేరస్తులు.. అత్యంత ప్రమాదకారులు.. గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు బానిసలై ఎంతటి నేరాలకైనా పాల్పడేందుకు వెనుకాడడం లేదు.. వీరికి సమాజంలో స్వేచ్ఛగా తిరిగే అవకాశం ఇస్తే శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రమాదం పొంచి ఉంది.. పీడీ యాక్ట్ అమలు చేయాలి.. అని పోలీసులు నెల క్రితం ఫైల్ సిద్ధం చేసి కలెక్టర్‌కు నివేదించారు. అయితే ఇంతవరకు ఆ ఫైల్‌కు మోక్షం కలగలేదు. కరుడ గట్టిన నేరస్తులు 15 మందిపై పీడీ యాక్ట్ ప్రయోగించారు. వీరిలో అత్యధిక మంది పీడీ యాక్ట్ నిర్బంధ గడువు ముగించుకుని బయటకు వచ్చారు. ఇదే తరహాలో మరికొందరు కరుడుగట్టిన రౌడీషీటర్లు, కామోన్మాధులు, గంజాయి విక్రేతలతో మరో జాబితాను పోలీసులు రూపొందించారు. ఈ జాబితాలో కరుడుగట్టిన రౌడీషీటర్ కుక్కల శివ, పోలీసునని జంటలను బెదిరించి యువతులపై వరుసగా అత్యాచారాలకు పాల్పడుతున్న చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని వేజండ్లకు చెందిన గోపి ఉన్నట్లు తెలిసింది. అయితే ఈ ఫైల్‌పై కలెక్టర్ సంతకం కోసం కలెక్టరేట్‌లో నెల రోజులుగా పెండింగ్ లో ఉంది. పీడీ యాక్ట్ ఫైలుపై కలెక్టర్ ఎప్పుడు సంతకం చేస్తారోనని పోలీసులు ఉన్నతాధికారులు ఎదురుచూస్తున్నారు. పీడీ యాక్ట్ ఫైలు పెండింగ్‌లో ఉండడంతో పోలీసు అధికారులు ఆ జాబితాలోని నిందితుల కదలికలను గమనిస్తున్నారు. ఇటీవల రౌడీషీటర్ కుక్కల శివకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఈ జాబితాలోని కొందరు గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు బానిసలు కావడంతో వారు ఏ సమయంలో ఎటువంటి నేరాలకు పాల్పడతారోనని పోలీసులు ఒకింత ఆందోళన చెందుతున్నారు. త్వరితగతిన పీడీ యాక్ట్ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చాలని వారు ఆశిస్తున్నారు.



హత్యలకు పథకాలు..

నగరాలు ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ సంతోష్‌రెడ్డి వైసీపీ హయాంలో ఐదేళ్ల రెచ్చిపోయాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్లేట్ ఫిరాయించి టీడీపీ పంచన చేరాడు. కొరిటెపాడుకు చెందిన టీడీపీ సానుభూతిపరుడైన రౌడీషీటర్ సుభానికి, సంతోష్‌రెడ్డి మధ్య మనస్పర్ధలు రావడంతో ఒకరి హత్యకు ఒకరు పథకం రూపొందించినట్లు పోలీసులకు ఉప్పందింది. దీంతో సుభానిని అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌కు, సంతోష్‌రెడ్డిని నల్లపాడు పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. సంతోష్‌రెడ్డిని కౌన్సెలింగ్‌కు పిలవడంపై టీడీపీకి చెందిన ఓ నేత ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్టేషన్‌కు వెళ్లడం వివాదాస్పదమైంది. ఓ రౌడీషీటర్ కోసం ఓ నేత స్టేషన్‌కు రావడం గమనార్హం. దీన్నిబట్టి జిల్లాలో రౌడీషీటర్లు రాజకీయ నాయకుల పంచన చేరి తమ పబ్బం గడుపుకుంటున్నారని స్పష్టమవుతుంది.



బీసీల అభివృద్ధికి కూటమి కట్టుబడి ఉంది

సత్తెనపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికులకు మద్యం దుకాణాల కేటాయింపులో పది శాతం రిజర్వేషన్ కల్పించటం టీడీపీ బీసీల పార్టీ అనటానికి నిదర్శనమని రాష్ట్ర నీర, గీత కార్మిక ఫెడరేషన్ చైర్మన్, టీడీపీ సత్తెనపల్లి నియోజకవర్గ పరిశీలకులు తాత జయ ప్రకాష్ నారాయణ అన్నారు. గురువారం సత్తెనపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఎప్పుడూ బీసీలకు అండగా ఉంటూ బీసీ సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మద్యం దుకాణాల్లో గీత కార్మికులకు 335 షాపులు కేటాయించటంపై బీసీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయన్నారు. గీత కార్మికుల ఆర్థిక బలోపేతానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. లైసెన్స్ ఫీజులో గీత కార్మికులకు 50 శాతం రాయితీ కల్పించిందన్నారు. గీత కార్మికులకు పది శాతం మద్యం దుకాణాలు కేటాయించ కూడదని హైకోర్టులో తన మనుషుల చేత 30 రిట్ పిటీషన్‌లను వైఎస్ జగన్ దాఖలు చేయించాడన్నారు. మద్యం దుకాణాలు కేటాయిస్తే గీత కార్మికులు ఆర్థికంగా బలోపేతం అవుతారని భావించి, దీన్ని అడ్డుకొనేందుకు వైఎస్ జగన్ పన్నాగం పన్నారన్నారు. జగన్ బీసీల వ్యతిరేకి అని మరోసారి రుజువైందన్నారు. వైసీపీ పాలనలో బీసీలను జగన్‌మోహన్‌రెడ్డి అణిచి వేశారన్నారు. వైసీపీ పాలనలో పదిశాతం రిజర్వేషన్ తగ్గించటం వల్ల 18 వేల మంది బీసీలు రాజకీయ పదవులకు దూరమయ్యారన్నారు. రాజకీయ పదవుల్లో 33 శాతం పదవులు బీసీలకు కేటాయించి వారి రాజకీయ ఎదుగుదలకు కూటమి ప్రభుత్వం బాటలు వేసిందన్నారు.

14 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తాళ్లపాలెం గ్రామంలో 14 క్వింటాళ్ల రేషన్ బియ్యంను రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ కోటేశ్వరరావు కథనం ప్రకారం తాళ్లపాలెం గ్రామంలో రేషన్ బియ్యం తరలిస్తున్నారని సమాచారంతో బుధవారం రాత్రి రూరల్ పోలీసులు గ్రామంలో సోదాలు నిర్వహించారు. 28 బస్తాలలో నిల్వ ఉన్న రేషన్ బియ్యం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 547.80 అడుగులు ఉంది. ఇది 204.95 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,200 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6248 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 12,275 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2200, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 31,203 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 16,099 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.



ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

ఉద్యోగావకాశాలు

➡ మయూరి బార్ & రెస్టారెంట్లో F/P టైం పని చేయుటకు వెయిటర్లు, సప్లయర్లు, సూపర్ వైజర్లు, కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. రూం+భోజన వసతి కలదు. 7075338338, 8143198968. AJG-204372

➡ మేల్ వార్డెన్ కావలెను:దయానంద వేద గురుకులం రాయపూడి గ్రామం బాలురకు దినచర్య మరియు క్రమశిక్షణ ఉంచుటకు 50సం॥లలోపు మేల్ వార్డెన్ కావలెను. వసతి భోజనము ఉచితము. శాలరీ : 10,000/-. సంప్ర॥ 9985978380, 9440632175 AJG-204276

➡ విశ్రాంతి ఉద్యోగులకు శుభవార్త గుంటూరు నగరంలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు 10th పాస్, 40సం॥పై వయస్సు వారు కావలెను. సంప్ర॥ 94901 27118. AJG-204368

➡ పేరేచర్లలోని ప్రముఖ సంస్థ నందు పని చేయుటకు పేజ్ మేకర్, ఫొటో షాపు నందు అనుభవం కలిగిన స్త్రీ / పురుష డిజైనర్లు కావలెను. వివరాలకు సంప్రదించండి : 89774 88847 AJG-204369

➡ రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూమ్ గుంటూరు, మంగళగిరి, పొన్నూరులలో పనిచేయుటకు సేల్స్ మేనేజర్ (exp. 2 సం॥) సేల్స్ స్టాఫ్ (M/F. exp. 1 సం॥) అకౌంటెంట్స్ (exp. 3 సం॥) గుంటూరు కావలెను. సంప్ర॥ 8341622655, 8143008504. KC-1205

అద్దెకు

➡ 2 BHK with Car Parking East Facing in Ramdas Enclave, Kunchanapalli, Guntur Dist., Cont : 949494 9559, 94909 64625 AJB-225779

రియల్ ఎస్టేట్

➡ శ్రీకృష్ణ బృందావనం ! ఫార్మ్ లాండ్ గుంటూరు నుండి బోయపాలెం మీదుగా కొండవీడు పర్యటక ప్రాంతం సమీపంలో సెంటు - లక్ష రూపాయలు (1Lac), పక్కా రిజిస్ట్రేషన్, సంప్ర॥ 9381449563. AJG-210353

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు
99854 03281
సమయం : ఉ॥ 10:00 గం॥ల నుండి సా॥ 06:00 గం॥ల వరకు (సోమవారం నుండి శనివారం వరకు)

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి



ఈ సీఈవో మాకొద్దు

- జిల్లా పరిషత్‌ను భ్రష్టు పట్టించారు
- కమీషన్లపై తప్ప.. కార్యాలయంపై శ్రద్ధలేదు
- పంచాయతీ రాజ్ మంత్రి, కమిషనర్‌కు లేఖ రాసిన చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా



గుంటూరు సిటీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సీఈవో జ్యోతిబసు అవినీతికి హద్దు లేకుండా పోయిందనీ, కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపునకు రెండు శాతం మామూళ్లు ముట్టజెప్పాలన్న నిబంధన పెట్టారనీ, ఎంపీడీవోల కార్యాలయాలు, గ్రామ పంచాయతీల తనిఖీకి వెళ్లినప్పుడు రూ. 25 వేలకు తగ్గకుండా కవర్లు ఇవ్వాలని హుకుం జారీ చేశారని తదితర ఆరోపణలతో ఉపముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్, పంచాయతీ రాజ్ కమిషనర్‌కు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా లేఖ రాశారు. జడ్పీ సీఈవోపై అవినీతి ఆరోపణలు చేస్తూ చైర్‌పర్సన్ లేఖ రాయడం సంచలనంగా మారింది. గత కొద్ది రోజులుగా జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినాకు, సీఈవో జ్యోతిబసుకు మధ్య అంతర్గత యుద్ధం జరుగుతుంది. పాలకవర్గం తీసుకున్న నిర్ణయాలను సైతం సీఈవో పక్కన పడవేస్తుండటం వివాదానికి మూలకారణంగా కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో కొన్ని వందల ఫైళ్లను సీఈవో పరిష్కరించకుండా జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. చివరకు జిల్లా పరిషత్ అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే విద్యా దీవెన స్టడీ మెటీరియల్ వ్యవహారంలో కూడా సీఈవో జడ్పీ చైర్‌పర్సన్ చేసిన సూచనలు బేఖాతార్ చేయటంతో వివాదం ముదిరి పాకాన పడింది.

సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు వద్దు

ప్రతి ఏటా జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు జడ్పీ నుంచి స్టడీ మెటీరియల్ అందజేస్తున్నారు. విద్యా దీవెన పేరుతో ఈ కార్యక్రమం అమలు జరుగుతుంది. ప్రతి ఏటా ముద్రించే స్టడీ మెటీరియల్‌పై ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి ఫొటోలు ముద్రించటం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా అదే రీతిలో స్టడీ మెటీరియల్‌పై సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఫొటోలు వేయాలని చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా సూచించినట్లు తెలుస్తుంది. అందుకు సీఈవో ఒప్పుకోక పోగా, ఆ విషయాన్ని అడ్డం పెట్టుకుని స్టడీ మెటీరియల్ ముద్రణ విషయంలో తీవ్రమైన జాప్యం చేసినట్లు చైర్ పర్సన్ ఆరోపిస్తున్నారు. కేవలం స్టడీ మెటీరియల్ విషయమై పది సార్లు సమావేశం ఏర్పాటు చేసి డిసెంబరు నెలలో నే విద్యార్థులకు వాటిని అందజేయాలని సూచించినా, టెండర్లు పిలవటానికి నెల రోజులు కాలయాపన చేసినట్లు ఆరోపిస్తున్నారు. చివరకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఫొటోలు లేకుండానే విద్యా దీవెన స్టడీ మెటీరియల్ వచ్చేసిందని చైర్‌పర్సన్ పేర్కొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 13 నెలలుగా జీతాల్లేవు

సీఈవో వైఖరి వలన గత 13 నెలలుగా జడ్పీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కు జీతాల్లేక అల్లాడిపోతున్నారని చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా ఆరోపిస్తున్నారు.

సీసీ ద్వారా మంత్రి కార్యాలయానికి లేఖ..

పంచాయతీ రాజ్ శాఖ మంత్రిని స్వయంగా కలిసి లేఖను అందజేయాలని చైర్ పర్సన్ తొలుత భావించారు. అయితే ఆయన అనారోగ్యంతో ఉన్నారని తెలుసుకొని లేఖను సీసీ ద్వారా మంత్రి కార్యాలయానికి గురువారం పంపారు. ఉపముఖ్యమంత్రి కోలుకున్న తర్వాత ఆయన్ను స్వయంగా కలిసి సీఈవోపై ఫిర్యాదు చేస్తానని చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా తెలిపారు.

బాలల హక్కుల పరిరక్షణపై సమీక్ష


సమీక్షా సమావేశంలో బాలల హక్కుల కమిషన్ సభ్యులు, అధికారులు

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన కోటప్పకొండ తిరునాళ్లలో కోటయ్యను దర్శించుకునేందుకు లక్షలాది మంది పెద్దలు, వేలాది మంది చిన్నపిల్లలు హాజరయ్యే అవకాశం ఉన్నందున బాలలకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లుపై ఆలయ ప్రాంగణంలో గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ఆలయ అధికారులు, కార్మిక శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు, గ్రామ సచివాలయాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మావతి, ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి చంద్రశేఖర్ ద్వారా గత ఏడాది ఎంతమంది పిల్లలు ఈ ఉత్సవాల్లో పాల్గొని ఉంటారు, వారిలో చంటి పిల్లలు సంఖ్య ఎంత, బాలింతలు ఎంతమంది హాజరై ఉంటారు, అధికారిక లెక్కలు ఉన్నాయా, ఆలయంలో పిల్లలకు ప్రత్యేక పాలసీలు ఏమైనా అమలు చేస్తున్నారా, వాటి వివరాలు సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది బాలింతలు, చిన్న పిల్లలు స్వామివారి దర్శనానికి ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నారా, దివ్యాంగ పిల్లలు దర్శనానికి ఎటువంటి ఏర్పాట్లు చేస్తున్నారు తదితర వివరాలు అడిగారు. బాల యాచకులు లేకుండా దేవస్థానం అధికారులు సమన్వయంతో ఎటువంటి చర్యలు చేపట్టారో కార్మిక శాఖాధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో బాలల హక్కులు, వాటి పరిరక్షణకు సమీక్ష సమావేశాలు నిర్వహించి, సంబంధిత ఉన్నతాధికారులకు వివిధ ఆదేశాలు జారీ చేస్తున్నట్లు తెలిపారు. కోటప్పకొండ ఆలయ కార్యనిర్వహణ అధికారి దాసరి చంద్రశేఖర్, సీడీపీవో ఉమామహేశ్వరి, వై.ప్రశాంత్‌కుమార్, ఆదిలక్ష్మి, ఎం.వాణి, జి.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

జలవిహార్, ఫుడ్‌కోర్టులు సిద్ధం చేస్తాం

- పర్యాటక శాఖ జిల్లా అధికారి గంగినేని నాయుడమ్మ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


జలవిహార్‌ను పరిశీలిస్తున్న పర్యాటక శాఖ అధికారి గంగినేని నాయుడమ్మ

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండలో ఈ నెల 26వ తేదీన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జరగనున్న తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా ఏర్పాట్ల నిర్వహణలో పర్యాటక శాఖ ఉత్సాహం చూపించడంలేదు. ఈ నేపథ్యంలో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో కోటప్పకొండలో ఉద్యానవనం వెలవెల అనే కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన పర్యాటక శాఖ జిల్లా అధికారి గంగినేని నాయుడమ్మ గురువారం కోటప్పకొండలోని మెట్లమార్గం వద్ద గల జలవిహార్, ఫుడ్‌కోర్టులను పరిశీలించారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి గంగినేని నాయుడమ్మ మాట్లాడుతూ కొండ కింద మెట్లమార్గం వద్ద గల జలవిహార్, ఫుడ్‌కోర్ట్‌ను ఎటువంటి నిర్వహణ వ్యయం లేకుండా గుత్తేదారుడుకి ఇచ్చినా కూడా నిర్వహించలేనని వెళ్లిపోయాడన్నారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాల మేరకు రానున్న శివరాత్రి మహోత్సవం సందర్భంగా జలవిహార్, ఫుడ్ కోర్ట్ సందర్శకులకు సౌకర్యాలు అందించాలని ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. వారు దానిని బాగు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని, శివరాత్రి మహోత్సవం రోజుకి ఫుడ్‌కోర్ట్, జలవిహార్‌లో కనీసం రెండు లేదా మూడు పెడల్ బోట్స్‌తో పర్యాటకులకు సౌకర్యం కల్పించే విధంగా సిద్ధం చేస్తున్నామని తెలిపారు. తదనంతరం ఎవరైనా గుత్తేదారులు ముందుకు వస్తే నిర్వహణ బాధ్యతలు అప్పజెప్పడానికి ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ టెండర్లు కూడా సిద్ధం చేస్తున్నారని తెలిపారు.

నేటితో ఇసుక తవ్వకాలకు ముగియనున్న అనుమతులు


గాజుల్లంక వద్ద ప్రభుత్వ ఉచిత ఇసుక డంపింగ్ యార్డు

కొల్లూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత ఇసుక రీచ్‌ల కాలపరిమితి శుక్రవారంతో ముగియనుంది. ప్రజల అవసరార్థం కొల్లూరు మండలం గాజుల్లంకలో ప్రభుత్వం ఉచిత ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేసింది. గత అక్టోబరు 16న గుత్తేదారులకు కృష్ణానదిలో ఉచిత ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చింది. అప్పటి నుంచి గుత్తేదారులు కృష్ణానదిలో తవ్వకాలు చేసి నది ఒడ్డున ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులో ఇసుక నిల్వ చేసి వినియోగదారులకు అందిస్తున్నారు. అయితే ప్రభుత్వం నిర్దేశించిన ధరలు మాత్రం ఎక్కడా అమలు కాకపోవడంతో వినియోగదారులకు ఉచిత ఇసుక అందని ద్రాక్షగా మారింది. గుత్తేదారులకు మాత్రం కాసుల వర్షం కురిపించింది. ఇసుక తవ్వకాల్లో గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలు ఎక్కడా అమలు కాకపోవడం గమనార్హం. ఉచిత ఇసుక తవ్వకాల పేరుతో గుత్తేదారులు అప్పటి నుంచి ఇష్టానుసారంగా నదిలో ఎక్కడబడితే అక్కడ రాత్రి పగలు తేడా లేకుండా తవ్వి సొమ్ము చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు పర్యావరణ అనుమతులు ముగియనుండటంతో ఇక గాజుల్లంక వద్ద కృష్ణానదిలో ఇసుక తవ్వకాలు నిలిపి వేయాల్సి ఉంది. అయితే గుత్తేదారులు మాత్రం కాలపరిమితి ముగిసినప్పటికీ ఇసుక తవ్వకాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇసుక తవ్వకాలకు సంబంధించిన అనుమతులు పొడిగించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. తవ్వకాలు పూర్తిగా నిలిపి వేస్తారో తిరిగి కొనసాగిస్తారో వేచి చూడాల్సిందే.

అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకుంటాం

కృష్ణానదిలో విచ్చలవిడిగా ఇసుక అక్రమ తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. మండల పరిధిలోని గాజుల్లంక ఇసుక రీచ్‌కు అనుమతులు శుక్రవారం సాయంత్రంతో ముగియనున్నట్లు చెప్పారు. మండల పరిధిలోని అరవింద వారధి, చిలుమూరు గ్రామాల వద్ద కృష్ణానదిలో స్థానిక అవసరాల పేరుతో విచ్చలవిడిగా ఇష్టానుసారంగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చిందన్నారు. ఆయా తవ్వకాలను కూడా అడ్డుకుంటామని, ప్రభుత్వం నిర్దేశించిన ప్రాంతాల్లోనే ఇసుక తవ్వకాలు జరిగేలా చూస్తామన్నారు. అరవింద వారధి, చిలుమూరు వద్ద ఇసుక అక్రమ తవ్వకాలు నిలువరించేందుకు పోలీసు శాఖలో సమన్వయం చేసుకుని ప్రత్యేక బృందాలను నియమించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

క్రమబద్ధమైన వ్యాయామంతో మానసిక రుగ్మతలు దూరం


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె.గంగాధరరావు, ఇతర అధికారులు

పెదకాకాని, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నడక, వ్యాయామం, యోగా వంటి మంచి అలవాట్లను క్రమం తప్పకుండా పాటిస్తే మానసిక రుగ్మతలు, ఒత్తిడి నుంచి బయటపడవచ్చునని విశ్వవిద్యాలయ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె.గంగాధరరావు పేర్కొన్నారు. మేనేజింగ్ స్ట్రెస్ డిప్రెషన్ టు ఎస్ హాన్స్ సైకలాజికల్ క్యాపిటల్ అనే అంశంపై వర్సిటీలోని సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల యూజీసీ జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. ప్రారంభ సదస్సుకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ మాట్లాడుతూ పని ఒత్తిడి అనేది ఈ రోజుల్లో సర్వసాధారణమైన విషయం అన్నారు. డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ జీవితంలో ఒత్తిడి నుంచి బయట పడాలంటే సుఖమయ జీవనాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జ్ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి మాట్లాడుతూ మానవ జీవన ప్రయాణంలో సైకలాజికల్, మెంటల్, ఫిజికల్ హెల్త్ విషయాలలో ఒత్తిడి అధికంగా ఉంటుందన్నారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య జి .సింహాచలం మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంతో పాటు సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.వీరయ్య, పాలకమండలి సభ్యులు ఇండ్ల రాధా, సైకాలజీ విభాగాధిపతి ఆచార్య జి.చెన్నారెడ్డి, సదస్సు డైరెక్టర్ ఆచార్య టీడీ విమల ప్రసంగించారు. పరిశోధన పత్రాలను ముద్రించిన పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన డాక్టర్ రవికాంత్, ఆచార్య ప్రసాద్ బాబు, డాక్టర్ సువర్ణ రాజు, డాక్టర్ స్వాతి, ఆచార్య సరోజ, విభాగం అధ్యాపకులు కె.కృష్ణమోహన్, ఎస్.అనుపమ, బి. ప్రమీలారాణి, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతిపై అత్యాచారం: కేసు నమోదు

మాచవరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఒంటరిగా ఉన్న యువతిపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి పై కేసు నమోదు చేసిన సంఘటన మండల కేంద్రమైన మాచవరంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మాచవరంలోని బుడగ జంగాల కాలనీలో ఓ యువతి ఇంట్లో ఒంటరిగా ఉంటుంది. ప్రతి రోజూ మాచవరం గ్రామానికి చెందిన నల్లమేకల వెంకటేష్ జీవాలు మేపుకుంటూ ఆ యువతిని చూస్తూ ఉండేవాడు. బుధవారం ఆ యువతి ఇంట్లోకి చొరబడి యువతి నోట్లో బట్టలు కుక్కి అత్యాచారానికి పాల్పడ్డాడు. అదే సమయంలో పొలం నుంచి తిరిగి వచ్చిన యువతితల్లిని చూసి వెంకటేష్ పరారయ్యాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తండ్రితో యువతి తల్లి జరిగిన సంఘటన వివరించగా వెంటనే చికిత్స నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. జరిగిన సంఘటనపై మాచవరం పోలీసులకు యువతి ఫిర్యాదు చేసింది. ఎస్ఐ సతీష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మసాజ్ సెంటరుపై పోలీసుల దాడి

- ముగ్గురు యువతులు అరెస్టు

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశానుపల్లి పంచాయతీ పరిధిలోని లలితాదేవి నగర్ మొదటి లైన్‌లో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న మసాజ్ సెంటరుపై నరసరావుపేట రూరల్ ఎస్ఐ కిషోర్ దాడి చేశారు. ఈ దాడులలో నిర్వాహకుడు సుబ్రమణ్యంతోపాటు మరో ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు. వారిని కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. నరసరావుపేట మండలంలో ఎటువంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కాలువలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


విజయ్‌కుమార్ (ఫైల్)

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో కుడి కాలువలో దూకి గల్లంతైన వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైంది. పట్టణంలోని 10వ వార్డుకు చెందిన గుంటూరు విజయ్‌కుమార్ (28) పట్టణంలోని రింగు రోడ్డు ప్రాంతంలో టీస్టాల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాది క్రితం రేపల్లెకి చెందిన సుబ్బలక్ష్మితో వివాహమైంది. గత కొంతకాలంగా భార్య సుబ్బలక్ష్మితో మనస్పర్థలు రావడంతో ఘర్షణలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన విజయ్‌కుమార్ గత మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో తన అక్క యాగంటి స్వాతి, బావ ఆదినారాయణకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పి పట్టణంలోని బొంబాయి కంపెనీ వద్ద గల కుడికాలువలో దూకాడు. కాగా విజయ్‌కుమార్ మృతదేహం గురువారం దుర్గి వద్ద గల బుగ్గవాగు డ్యాం వద్ద లభ్యమైంది. విషయం తెలుసుకున్న మాచర్ల పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

చేబ్రోలు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు గురువారం మృతి చెందాడు. చేబ్రోలు ఎస్సై వెంకట కృష్ణ కథనం ప్రకారం విజ్ఞాన్ యూనివర్సిటీ సమీపంలో బుధవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న మెట్లకాటి మణికంఠేశ్వర రెడ్డి (25) ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం స్థానికులు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మణికంఠేశ్వర్ రెడ్డి మృతి చెందాడు. మృతుడి తండ్రి లక్ష్మీరెడ్డి ఫిర్యాదు మేరకు చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం

చేబ్రోలు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు - కొమ్మమూరు కాల్వ సమీపంలో గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని చేబ్రోలు పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. చేబ్రోలు ఎస్సై వెంకటకృష్ణ కథనం ప్రకారం కొమ్మమూరు కాల్వ సమీపంలోని మురుగు కాలువలో యువకుడి మృతదేహం ఉందని పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు యువకుడు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. 30 ఏళ్లలోపు వయసు ఉంటుందనీ, మృతదేహంపై లేత గులాబీ రంగు చొక్కా, నేవీ బ్లూ ప్యాంటు ధరించి ఉన్నట్లు చెప్పారు. మృతదేహం ఆచూకీ తెలిసిన వారు 8688831384 నంబరుకు సంప్రదించాల్సిందిగా ఎస్సై సూచించారు.

చిత్రకళకు ప్రాణం పోసిన దామెర్ల


సభలో ప్రసంగిస్తున్న ఆచార్య సురేష్ కుమార్

పెదకాకాని, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర చిత్రకళకు ప్రాణం పోసిన మహా కళాకారుడు దామెర్ల రామారావు అని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఆర్ట్స్, లా కళాశాల ప్రచార్యులు ఆచార్య ఎమ్.సురేష్ కుమార్ కొనియాడారు. గురువారం తెలుగువారి వైభవాన్ని తన చిత్రాలతో చూపిన మహా కళాకారుడు "దామెర్ల రామారావు" శత వర్ధంతిని పురస్కరించుకొని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని లలిత కళల విభాగంలో సంస్మరణ సభను ఆచార్య ఎమ్.సురేష్ కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరాణిక, సామాజిక జీవన స్థితిగతులకు ప్రతిరూపాలుగా దామెర్ల రామారావు గీసిన చిత్రాలు నిలుస్తున్నాయని తెలిపారు. రామారావు గీసిన చిత్రాలు తెలుగువారి ఔన్నత్యానికి ప్రతీకని పేర్కొన్నారు. ఆధునిక, సంప్రదాయ చిత్రకళా రీతులను సమన్వయించి పాశ్చాత్య కళారీతుల్ని శోధించి ఆంధ్ర చిత్రకళకు ప్రాణం పోసిన చిత్రకారుడు దామెర్ల అని చెప్పారు. నేటి లలిత కళల విభాగ విద్యార్థులు దామెర్ల రామారావుని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. లలిత కళల విభాగం అధ్యాపకులు జాన్ రత్నబాబు, శ్రీనివాసరావు, పి. దేవకాంత్, బి.శేఖర్ బాబు, పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	123,132,142
చికెన్ విత్ స్కిన్	230.00
చికెన్ స్కిన్ లెస్	240.00

1,33,176 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,36,176 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,33,176 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 74,902 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	9000	13600	334	9500	11500
నెంబరు. 5	10000	13300	నెంబరు.5	--	--
273	10500	12000	273	10000	10000
341	10000	14700	341	13200	13200
4884	9500	12000	4884	--	--
సూపర్ 10	10500	14000	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15000	తేజ	11000	10000
బ్యాడిగి	10000	13500	బ్యాడిగి	9000	12000
దేవనూరు డీలక్స్	10000	13000	దేవనూరు డీలక్స్	--	--
తెల్లకాయలు	4000	7500	తెల్లకాయలు	4000	7500

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రః 99854 11213 99854 11225 99854 01877 99854 04047 99854 01614

నాలుగో రోజున.. ఐదు నామినేషన్లు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు ఉమ్మడి జిల్లాల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్న బోట్ల శివ సత్యనారాయణ, గునుకుల వెంకటేశ్వరరావు, డేగల సైదారాజు, గుడిసె రాంబాబు, గౌతుకట్ల అంకమ్మరావు గురువారం నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను కలెక్టరేట్‌లోని కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఎస్ నాగలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి ఖాజావలీ పాల్గొన్నారు.

ఆలపాటికి ఓటుతో పట్టభద్రుల భవితకు భద్రత

● విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే నసీర్

● ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్, చిత్రంలో ఆలపాటి రాజేంద్రప్రసాద్, నూకసాని బాలాజీ, సజీలా,టీడీపీ, జనసేన నాయకులు తదితరులు

గుంటూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు-కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యతా ఓటు ఆలపాటి రాజాకే ఇవ్వాలని, ఇది పట్టభద్రుల భవితకు భద్రత కల్పిస్తుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో అనుసరించాల్సిన వ్యూహం, ఓటింగ్ సరళిపై చర్చించే ందుకు ఆయన ఆధ్వర్యంలో గురువారం ఫాన్సీ మర్చంట్స్ కల్యాణమండపంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు నూకసాని బాలాజీ, ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ మంత్రి ఆలపాటి రాజా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టభద్రులు వేసే ప్రతి ఓటు వారి భవిష్యత్తుకు గీటురాయిగా మారుతుందని అన్నారు. గుంటూరు నగరంలో 30 వేలకుపైగా ఎమ్మెల్సీ ఓటర్లు ఉన్నారని, వారందరూ పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేసేలా చైతన్య పరచాలని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లాలో ఓటర్లంతా ఆలపాటి రాజాను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని, కూటమి ప్రభుత్వ పనితీరుకు ఇది తీర్పుగా మారుతుందని చెప్పారు. నూకసాని బాలాజీ మాట్లాడుతూ గుంటూరు జిల్లా ఓటర్లపై అపార నమ్మకం ఉందని, ఆలపాటి రాజాను భారీ మెజారిటీతో గెలిపించి తీరుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆలపాటి రాజా మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో శాసనమండలిలో పట్టభద్రుల తరఫున తాను గళం వినిపిస్తానని, ప్రథమ ప్రాధాన్యతా ఓటును తనకు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ, జనసేన గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరావు, చిట్టాబత్తిని చిట్టిబాబు, రాజా మాస్టర్, పాకనాటి రామ దేవి, జాగర్లమూడి శ్రీనివాసరావు,డిప్యూటీ మేయర్ సజీలా, కార్పొరేటర్ ఎలావుల అశోక్, ఆనంద్ సాగర్, ఎర్రి ధనలక్ష్మి, కార్పొరేటర్ భారతి, కార్పొరేటర్ మీరావలి పాల్గొన్నారు.

ప్రైవేటు ఉపాధ్యాయుల మద్దతు ఆలపాటికే: పీఎస్‌టీయూ



సమావేశంలో మాట్లాడుతున్న రాజా మాస్టారు

గుంటూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కే ప్రైవేటు ఉపాధ్యాయుల మద్దతు ఉంటుందని ప్రైవేట్ స్కూల్ టీచర్స్ యూనియన్(పీఎస్‌టీయూ) రాష్ట్ర కార్యవర్గం స్పష్టం చేసింది. స్థానిక నెహ్రూనగర్‌లోని శ్రీవికాస్ స్కూల్‌లో గురువారం యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లేశ్వరరెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ టీచర్స్ ఫోరం(టీఎస్‌పీటీఎఫ్)అధ్యక్షుడు వీరంకి మోహన్ రాయల్, పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్య క్షుడు దాసరి రాజా మాష్టారు, 13 ఉమ్మడి జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ మేరకు ఉపాధ్యక్షుడు భాస్కరరావు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని కమిటీ ఆమోదించింది.

కులజనగణన వెంటనే చేపట్టాలి

● మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి

గుంటూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ తరహాలోనే ఆంధ్రప్రదేశ్‌లోనూ కులజనగణనను వెంటనే చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి డిమాండ్ చేశారు. గుంటూరులోని ఆయనకార్యాలయంలో మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కులజనగణను జరిపి దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. సమాజంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక న్యాయం జరగాలంటే కులజనగణన కీలకమన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే కులజనగణన చేపట్టిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ కూటమి ప్రభుత్వం కులజనగణనపై స్పష్టత నివ్వాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు మేరకు చర్యలు తీసుకుంటారా లేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయండి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు డిమాండ్ చేశారు. స్థానిక బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో గురువారం ఆ పార్టీ జిల్లా విస్తృత సమావేశం జరిగింది. సమావేశానికి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పి.రామారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి 8 నెలలు గడిచినా పథకాలపై ఎటువంటి కార్యాచరణ ప్రకటించలేదని విమర్శించారు. అమలు చేయాలంటే ప్రజలపై భారాలు మోపాల్సి వస్తుందని ముఖ్యమంత్రి చెప్పడం సబబు కాదన్నారు. కేంద్రంలో భాగస్వామ్యంగా ఉన్నప్పటికి బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు రాబట్టడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.. జిల్లా కార్యదర్శి వై నేతాజీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇళ్ళులేని పేదలకు స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చిందని, ఆ హామీని విస్మరించా రన్నారు. సమావేశంలో ఎన్ భావన్నారాయణ, ఈమని అప్పారావు, ఎమ్.రవి, కె.నళినీకాంత్, డి.లక్ష్మీ నారాయణ, కే అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట నాల్గో లైనులోని శ్రీ హంపి విరూపాక్ష పీఠ పాలిత గంగా మీనాక్షి సోమ సుందరేశ్వర స్వామి దేవాలయ 124వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం రాత్రి ఆలయ ధర్మకర్త ఏకా ప్రసాద్ ఆధ్వర్యంలో యాగ బ్రహ్మ గుంటూరు కాశీ విశ్వనాథ శర్మ నేతృత్వంలో బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. తొలుత గో పూజ, గణపతి పూజ, పుణ్యాహ వచనం, అంకురార్పణ, పంచగవ్య ప్రసన, కలశ స్థాపన, అఖండ దీపారాధన, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠాపన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు కుందుర్తి సుబ్రమణ్య శర్మ, భాస్కర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని ఆత్మహత్య

గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని లాలుపురానికి చెందిన వేములపల్లి ఉదయ్ ఫణీంద్ర (34) ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నల్లపాడు సీఐ కే వంశీధర్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయ్ ఫణీంద్ర స్థానిక లక్ష్మీపురంలోని కరెంట్ ఆఫీసులో షిఫ్ట్ ఆపరేటర్ గా అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నాడు. కొంత కాలంగా మెదడులో నరాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ఉదయ్ ఫణీంద్ర గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య మాధవి ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఫణీంద్రకు కుమారుడు, కుమార్తె ఉన్నారు

గుర్తుతెలియని వ్యక్తులకు గాయాలు

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. మేడికొండూరు నుంచి సత్తెనపల్లి వెళ్ళే మార్గంలో ఈ ప్రమాదం జరిగింది. ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. జీజీహెచ్‌లో వారు చికిత్స పొందుతున్నారు. మేడికొండూరు దాటిన తర్వాత కేసిరెడ్డి కాలేజీ వద్ద జరిగన లారీ ప్రమాదంలో వారు గాయపడినట్టు సమాచారం. పోలీసులు విచారణ చేస్తున్నారు.

కూతురిపై అసభ్య ప్రవర్తన

ప్రశ్నించిన తండ్రిపై యువకుల హత్యాయత్నం

స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని విద్యానగర్ 1/3లో ఇరువురు యువకులు రెచ్చిపోయారు. స్థానికంగా ఉన్న పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న తన కుమార్తెను ఆమె తండ్రి ఈ నెల 5న రాత్రి ట్యూషన్ నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి తీసుకెళ్తున్నాడు. వీరి వాహనం ఆంజనేయ స్వామి గుడికి సమీపంలోకి రాగానే రాగానే ఇద్దరు యువకులు జానీ, నాగ సాయి ఆ బాలికపై అసభ్య వ్యాఖ్యలు చేశారు. ఈ విషయమై ప్రశ్నించిన బాలిక తండ్రిపై బీరు బాటిల్‌తో దాడి చేసే హత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

15లోగా రోడ్లపై ఆక్రమణలు పూర్తిగా తొలగించాలి

● జీఎంసీ కమిషనర్ శ్రీనివాసులు ఆదేశాలు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 15వ తేదీ లోగా వార్డు సచివాలయాల వారీగా డ్రైన్లు, రోడ్ల ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించాలని, ఆక్రమణలు పునరావృతం కాకుండా ప్లానింగ్ కార్యదర్శులు, టీపీబీఓలు బాధ్యత తీసుకోవాలని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో పట్టణ ప్రణాళిక అధికారులు, కార్యదర్శులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో నాలుగు ఆర్‌ఓబీల నిర్మాణపు పనులు ప్రారంభమైతే ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా రోడ్ల, డ్రైన్ల ఆక్రమణలను తప్పనిసరిగా తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. ఏటీ అగ్రహారం జీరో లైన్, శారదకాలనీ, తారకరామ నగర్, నెహ్రూనగర్ మెయిన్ రోడ్లకు సంబంధించి రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ (ఆర్డీపీ) లను సిద్ధం చేయాలన్నారు. సోమవారం నుంచి సచివాలయాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, త్వరలో జియో ట్యాగ్‌కి సమంబంధించి ప్రత్యేక యాప్ అందుబాటులోకి తీసుకు రానున్నట్లు చెప్పారు. నగరంలో అనధికార హోర్డింగ్‌లు, బ్యానర్లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టిన మిస్సింగ్ సిటిజన్, ఎంఎస్‌ఎంఈ సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఏసీపీలు రెహమాన్, వెంకటేశ్వర రావు, మలికార్జునరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రోడ్లకు ప్యాచ్ వర్క్‌లు ఎప్పటికప్పుడు చేపట్టాలి



డ్రైనేజీ ని పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

వార్డు సచివాలయాల వారీగా ప్రధాన, అంతర్గత రహదారులకు ప్యాచ్ వర్క్‌లను ప్రజలకు ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు చేపట్టాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక రాజాగారితోట, పొన్నూరు రోడ్డు, బాలాజీ నగర్, కొరిటెపాడు, నవభారత్‌నగర్, వికాస్ నగర్ తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఆయా చోట్ల జరుగుతున్న అభివృద్ధి, పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. చేపట్టాల్సిన చర్యలపై ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజా రోగ్య అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బాలాజీ నగర్ రాజీవ్ గృహకల్ప ప్రాంతం లోని యానాది కాలనీలో నూతన డ్రైన్ నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలన్నారు. డ్రైన్లలో సిల్ట్‌ని ఎప్పటికప్పుడు తొలగించాలని, చెత్త తరలింపునకు అవసరమైతే ప్రైవేట్ ట్రాక్టర్లు అద్దెకు తీసుకోవాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. గృహ కల్ప ప్రాంతంలో డ్రైన్ ఆక్రమణలను తక్షణం తొలగించాలని పట్టణ ప్రణాళిక కార్యదర్శులను ఆదేశించారు. కొరిటెపాడు, వికాస్‌నగర్ ప్రాంతాల్లో స్థానిక అవసరాల మేరకు డ్రైన్ల నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని చెప్పారు అనంతరం బస్టాండ్ దగ్గరలోని అన్న క్యాంటీన్‌ని ఆయన పరిశీలించారు.

ఘనంగా రోటరీ క్లబ్ పురస్కారాల ప్రదానం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ లోని వెంకటేశ్వర స్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆధ్వర్యంలో రోటరీ వొకేషనల్ ఎక్సెలెన్స్ అవార్డుల ప్రదాన కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సినీ నటుడు జీవ (కొచ్చర్ల దయారత్నం), సర్జన్ డాక్టర్ నూతలపాటి శ్రీనివాసరావు, చార్టెడ్ అకౌంటెంట్ పీవీ మల్లికార్జునరావు, పారిశ్రామికవేత్త దేసు సూర్యప్రకాశరావు, సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్ ఏలూరి నందినిలను ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు గాలి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సత్కార కార్యక్రమంలో 3105 విశ్రాంత గవర్నర్ అన్నే రత్న ప్రభాకర్, దేవస్థానం అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య, పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ వడ్లమాని రవి, అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు తదితరులు పాల్గొన్నారు.

నాస్తిక మేళాని అడ్డుకోవాలి: హైందవ చైతన్య వేదిక

గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రాంతంలోని నిడమర్రులో 'దేవుడు లేడు... దేవుడు లేనే లేడంటూ' చార్వాక ఆశ్రమం నిర్వహించ తలపెట్టిన నాస్తిక మేళా కార్యక్రమాన్ని అడ్డుకోవాలని హైందవ చైతన్య వేదిక నాయకుడు సిరిపురపు శ్రీధర్ శర్మ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ నెల 8, 9 తేదీల్లో ఆ సంస్థ ఈ కార్యక్రమం నిర్వహించబోతున్నదన్నారు. ఆస్తికవాదులు, ఆధ్యాత్మిక భక్త బృందాలు, అమరావతి రాజధానికి భూములు ఇచ్చిన రైతు కుటుంబాలు ఈ కార్యక్రమం జరగకుండా నిలువరించి హైందవుల మనోభావాలను కాపాడాలన్నారు.

ఎక్సైజ్ కోర్టులో లొంగిపోయిన రియల్టర్

● 'మహి అగ్రి'ను మోసగించిన కేసులో ప్రధాన నిందితుడు పుల్లారావు

● 20 వరకు రిమాండ్



పాలడుగు పుల్లారావు (ఫైల్)

గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మహి అగ్రి సంస్థను రూ 11.62 కోట్లకు మోసం చేసిన కేసులో ప్రధాన నిందితుడు, విజయలక్ష్మి టౌన్ షిప్ నిర్వాహకుడు పాలడుగు పుల్లారావు గురువారం గుంటూరులోని ఎక్సైజ్ కోర్టులో లొంగిపోయాడు. ఈ నెల 20 వరకు.. పద్నాలుగు రోజుల పాటు రిమాండ్ విధిస్తూ మెజిస్ట్రేట్ జీ స్పందన ఆదేశాలు ఇచ్చారు. దీంతో పుల్లారావును పోలీసులు జిల్లా జైలుకు తరలించారు. ఇటీవల పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో పుల్లారావుతో పాటు సాంబశివరావు, శ్రీ హర్ష వర్ధని, అనిల్ కుమార్ తదితరులపై కేసు నమోదైంది. మహి అగ్రి సంస్థను డాక్టర్ దండా రాజ్యలక్ష్మి నిర్వహిస్తున్నారు. తమ రియల్ ఎస్టేట్ సంస్థలో పెట్టుబడి పెడితే అధిక మొత్తంలో లాభాలు వస్తాయని పుల్లారావు, సాంబశివరావు, హర్షవర్ధని, అనిల్ కుమార్ తదితరులు రాజ్యలక్ష్మికి చెప్పి నమ్మించారు. ఆమెకు మాయ మాటలు చెప్పి 'మహి' సంస్థకు చెందిన రూ. 11.62 కోట్లను పుల్లారావు నేతృత్వంలోని రియల్ ఎస్టేట్ సంస్థలో పెట్టుబడులు పెట్టేలా నమ్మించారు. ఆమె ఆ మొత్తాన్ని వారి సంస్థలో పెట్టుబడిగా పెట్టింది. అయితే, దీనికి సంబంధించిన ఒప్పం దం రాసుకునే విషయంలో సంస్థ నిర్వాహకులు కాలయాపన చేయడంతో మోసపోయి నట్లు గ్రహించిన ఆమె పట్టాభిపురం పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ కేసులో నలుగురు నిందితులు ఉన్నారు. అందులో పుల్లా రావు ప్రధాన నిందితుడు.

నరసరావుపేటలో రూ. 200 కోట్లకు పైగా మోసం

నరసరావుపేటలో సాయి సాధన చిట్ ఫండ్ సంస్థ పేరుతో పుల్లారావు రూ. 200 కోట్ల వరకు మోసం చేయడంతో ఇప్పటికే ఆయనపై పలు కేసులు నమోదయ్యాయి. రూ. 200 కోట్లకు ఐపీ పెట్టాడు. వందలాదిమంది బాధితులు కొన్నిరోజులుగా లబోదిబోమంటున్నారు. ఈ పరిస్థితుల్లో అనూహ్యంగా గుంటూరులో నమోదైన కేసులో కోర్టులో లొంగిపోవడం చర్చ నీయాంశంగా మారింది.

స్వయం ఉపాధితో మహిళల ఆర్థికాభివృద్ధి

గుంటూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధితోనే మహిళల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ చెప్పారు. గుంటూరులోని అంజుమన్- ఈ- ఇస్లామియా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా 90 రోజులపాటు కుట్టుపనిలో శిక్షణ ఇచ్చారు. శిక్షణ అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా గురువారం వారికి కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం కుట్టుపనిలో నూతన ఒరవడులు వస్తున్నాయని, ఈ రంగానికి ఆదరణ పెరుగుతోందని చెప్పారు. తీసుకున్న శిక్షణను జీవనోపాధికి ఉపయోగించుకుంటూనే, ఈ రంగంలో మరింత ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. అన్ని రంగాల్లో మహిళా శక్తిని సీఎం ప్రోత్సహిస్తున్నారని, రాష్ట్రంలో డ్వాక్రా సంఘాలను తీసుకొచ్చింది కూడా ఆయనేనని చెప్పారు. కార్యక్రమంలో అంజుమన్- ఈ- ఇస్లామియా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్వాహకులు, అంజుమన్ కమిటీ సభ్యులు, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.



పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్‌లు

జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలలో ఏపీ ప్రతిభ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల తొలి వారంలో కేరళలో జరిగిన జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ చూపారు. పోటీలలో 19 రాష్ట్రాలు పాల్గొనగా ఏపీ ఆల్ ఇండియాలో ఆంధ్రప్రదేశ్ 5వ స్థానంలో నిలిచింది. ఈ పోటీలలో 11 బంగారు, వెండి 18, కాంస్యం 24 మొత్తం 53 పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులను ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్స్ అధ్యక్షుడు షేక్ లాల్‌వజీర్, నగర పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.



ప్రతిభావంతులైన విద్యార్థులతో రెక్టార్ రత్నషీలామణి, డీటీసీ సీతారామిరెడ్డి, రఘురామ్ తదితరులు

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

● ఏఎన్‌యూ ఇన్‌చార్జి రెక్టార్ రత్నషీలామణి

గుంటూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక యుగంలో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అందించినప్పుడే వారు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఇన్‌ఛార్జ్ రెక్టార్ రత్న షీలామణి కోరారు. శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్ (బ్రాడీపేట) 60వ వార్షికోత్సవ వేడుకలు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గురువారం సాయంత్రం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన రత్నషీలామణి మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి గురువులు, తల్లిదండ్రులు కృషి చేసినప్పుడే వారు ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కె సీతారామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే యువత ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, అప్పుడే ప్రమాదాల నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. వాహన చోదకులందరూ హెల్మెట్ ధరించాలని, అతివేగం ప్రమాదకరమన్నారు. పాఠశాల కరస్పాండెంట్ దుర్గా రఘురామ్ మాట్లాడుతూ ప్రస్తుతం గాడ్జెట్స్ ద్వారా విద్యార్థులు పక్కదారి పడుతున్నారని, వాటికి వారిని దూరంగా ఉంచాల్సిన బాధ్యత పెద్దలదేనన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉన్నారు.

గ్రీన్ హైడ్రోజన్‌తో విప్లవాత్మక మార్పులు

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో గ్రీన్ హైడ్రోజన్ ద్వారా విప్లవాత్మక మార్పులు రానున్నాయని హాకాంగ్ పాలిటెక్నిక్ వర్శిటీ డైరెక్టర్ డాక్టర్ బీ గోవర్ధన్‌బాబు అన్నారు. గురువారం జేకేసీ కళాశాలలో రసాయనశాస్త్రం, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజనీర్స్ అమరావతి ప్రాంతీయ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రీన్‌హైడ్రోజన్ ఇంధనంగా ఉపయోగిస్తే అనేక ఉపయోగాలు ఉంటాయని, కాలుష్యాన్ని అసాధారణ స్థాయిలో తగ్గించవచ్చునని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షకార్యదర్శులు జాగర్లమూడి మురళీమోహన్, ప్రిన్సిపాల్ పీగోపిచంద్, డాక్టర్ ఎం గౌరీశంకర్, డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, విజ్ఞాన్ వర్శిటీ మాజీ విసి డాక్టర్ గోవర్ధనరావు, జేసిల్ ప్రతినిధులు పీవెంకటేశ్వర్లు, డీ వాసుబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

నేడు జన రంజక కవి పురస్కారాల సభ

గుంటూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రావి రంగారావు సాహిత్య పీఠం 11వ ఏట ఇస్తున్న జనరంజక కవి ప్రతిభా పురస్కారాల సభ శుక్రవారం సాయంత్రం 6 గంటలకు స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని వెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికలో జరుగనున్నట్లు పీఠం కన్వీనర్ నర్రా ప్రభావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వర రావు, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ తరపట్ల సత్యనారాయణ, ప్రముఖ విద్యావేత్త గద్దె మంగయ్య, దేవాలయ పాలక మండలి అధ్యక్షుడు చిట్టి పోతు మస్తానయ్యతో పాటు కవులు గుమ్మా నాగమంజరి, లేదాళ్ళ రాజేశ్వరరావు, ప్రకాశ్ నాయుడు, నేలపూరి రత్నాజీ హాజరుకానున్నట్లు తెలిపారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేటలోని శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత ఓంకారక్షేత్రంలో జరుగుతున్న శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం నగర సంకీర్తన, అర్చనలు జరిగాయి. అనంతరం సీతారాముల కల్యాణాన్ని ఆలయ అర్చకులు వేద మంత్రాల నడుమ కనులపండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తలంబ్రాలు, విశేష హారతి, మంత్రపుష్పం తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం మంచికంటి వెంకట సత్యవతి శ్రీమద్రామాయణ ప్రవచనంలో అరణ్యకాండలోని విశేషాలను వివరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ కార్యదర్శి నంబూరు వేంకట శ్రీమన్నారాయణమూర్తి పర్యవేక్షించారు.



వీల్‌చైర్లతో డాక్టర్ టీసీ రెడ్డి దంపతులు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ

ప్రభుత్వాస్పత్రికి విరాళంగా పది వీల్ చైర్లు

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేటలోని శ్రీరామచంద్ర పిల్లల, దంత వైద్యశాల అధినేతలు డాక్టర్ టీ చంద్రశేఖరరెడ్డి, భార్య డాక్టర్ టీ సరస్వతి గురువారం ప్రభుత్వ సమగ్రాస్పత్రికి 10 వీల్‌చైర్లను విరాళంగా అందజేశారు. అన్నపూర్ణ ఛారిటబుల్ ట్రస్ట్ పేరిట ఈ వీల్‌చైర్లను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్‌ఎస్‌వి రమణకు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణ మాట్లాడుతూ పీడియాట్రిషియన్ డాక్టర్ టీసీ రెడ్డి వంటి పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న మాతృ విద్యా సంస్థకు మేలు చేయాలనే ఉద్దేశంతో ముందుకు రావడం హర్షణీయమన్నారు. వీల్‌చైర్లను విరాళంగా ఇచ్చిన వైద్యదంపతులను ఆయన అభినందించారు. భవిష్యత్తులో కూడా జీజీహెచ్/జీఎంసీకి తమ వంతు సహకారం అంద జేస్తామని డాక్టర్ చంద్రశేఖరరెడ్డి తెలిపారు.

ప్రభుత్వాస్పత్రి ప్రధాన ద్వారం మూసివేత

రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి ప్రధాన ద్వారం మరమ్మతుల కారణంగా శుక్రవారం నుంచి నిరవధికంగా మూసివేస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ తెలిపారు. వైద్యం కోసం వచ్చే రోగులు డాక్టర్ పొదిలి ప్రసాద్ బ్లాక్ దగ్గర ఉన్న గేటు ద్వారా, ఓపీ గేటు ద్వారా ఆసుపత్రిలోకి ప్రవేశించాలని తెలిపారు.



మాట్లాడుతున్న కనపర్తి శ్రీనివాసరావు, పాల్గొన్న వడ్రాణం హరిబాబు తదితరులు

మేయర్ రాజీనామా చేయాలి: కనపర్తి

గుంటూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మేయర్ మనోహర్ నాయుడికి ఏమాత్రం నైతిక విలువలున్నా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వైసీపీ సభ్యులు ఘోర పరాజయం పాలైనా మేయర్ మనోహర్ తన పదవికి రాజీనామా చేయక పోవటం సిగ్గు చేటని అన్నారు. సొంత పార్టీ కార్పొరేటర్లు ఛీకొట్టి ఓడించినా ఆయనకు బుద్ధి రాలేదన్నారు. టీడీపీ నుంచి గెలుపొందిన మద్దాళి గిరిధర్‌ను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా ఆరోజు వైసీపీలో ఎలా చేర్చుకున్నారో మాజీ మంత్రి అంబటి రాంబాబు సమాధానం చెప్పాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మద్దిరాల ఇమ్మానుయేల్ మాట్లాడుతూ మేయర్ పదవి నుంచి మనోహర్‌ను ప్రజాస్వామ్యబద్ధంగా దించటం ఖాయమని అన్నారు. సమావేశంలో వడ్రాణం హరిబాబు, ఆదాం, వీరాంజనేయులు పాల్గొన్నారు.

పగటి కలలు కంటున్న జగన్: కంచర్ల శివరామయ్య

గుంటూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మళ్ళీ తాను ముఖ్యమంత్రిని అయి, ముప్పై ఏళ్ల అధికారం చలాయిస్తానని జగన్ పగటికలలు కంటున్నారని టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య ఎద్దేవా చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాడు ప్రభుత్వాన్ని తన వ్యాపారానికి వాడుకున్న ఏకైక ముఖ్యమంత్రి జగనేనని విమర్శించారు. ఇసుక, వైన్స్, మైన్స్‌తో జగన్ సొంత వ్యాపారం చేసుకున్నారని, రాష్ట్రాన్ని గంజాయి రాష్ట్రంగా మార్చినందుకు, ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయించి జైళ్ళపాలు చేసినందుకు జగన్‌ని మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలా? అని ఎద్దేవా చేశారు. ఇప్పటికీ రాజధాని అమరావతిపై జగన్ విషం కక్కుతున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పాటిబండ్ల బలరాం, షేక్ చిన్న బాజీ, కేఎంఇ హుస్సేన్, పుల్లా సుందరంబాబు, వడ్డే శ్రీనివాసరావు, రాచకొండ లక్ష్మయ్య, మునగా గణపతి పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కులమతాలకు అతీతంగా సమాజంలో అందరూ కలసి మెలసి ఆనందంగా జీవించాలనే జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ల హరి కోరారు. గుంటూరు నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా ఎన్నికైన జనసేన కార్పొరేటర్ దాసరి లక్ష్మీదుర్గను గురువారం రెల్లి సంఘం రాష్ట్ర నేత సోమి ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో కూడా కార్పొరేటర్ దాసరి లక్ష్మీదుర్గ పట్టుబట్టి 16వ డివిజన్‌ను అభివృద్ధి చేశారని హరి కొనియాడారు. స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా నగరాభివృద్ధికి మరింతగా కృషి చేయాలని కోరారు. అదేవిధంగా లక్ష్మీదుర్గను జనసేన పార్టీ నగర డివిజన్ అధ్యక్షుడు నరసింహారావు, దాసరి వెంకటేశ్వరరావు, కొలసాని బాలకృష్ణ, చెన్నం శ్రీకాంత్, ఎస్‌కే షర్ఫుద్దీన్, కదిరి సంజయ్ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు సత్కరించారు.

డైమండ్ జూబ్లీ జంబోరిలో చురుకుగా పాల్గొన్న స్కౌట్స్ అండ్ గైడ్స్

గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని తిరుచిరాపల్లిలో జరిగిన స్కౌట్స్ అండ్ గైడ్స్ డైమండ్ జూబ్లీ జంబోరిలో జిల్లా నుంచి 21 మంది బృందం పాల్గొని అవార్డులు పొందడం అభినందనీయమని రైల్వే గుంటూరు సీనియర్ డీపీవో షాబాజ్ హనూర్ అన్నారు. గురువారం స్కౌట్స్ అండ్ గైడ్స్ బృందం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌కు వచ్చి సీనియర్ డీపీవోని కలిసింది. ఈ సందర్భంగా వారందరిని ఆయన అభినందించారు. గ్రేడ్ ఏ అవార్డులు ఏడు, గ్రేడ్-బీ అవార్డులు 10, గ్రేడ్‌సీ అవార్డు -1, జంబోరి, జంబోరి యాక్టివిటీస్ అండ్ అడ్వెంచర్ అవార్డులు పొందడం స్ఫూర్తిదాయకమన్నారు.



షోను ప్రారంభిస్తున్న డాక్టర్ షమా సుల్తానా, డాక్టర్ ఐశ్వర్య తదితరులు

మలబార్ షోరూమ్‌లో ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యూయలరీ షో ప్రారంభం

గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో ఆర్టిస్ట్రీ షో జ్యూయలరీ ప్రదర్శనను గురువారం డాక్టర్ షమా సుల్తానా, డాక్టర్ ఐశ్వర్య, కాస్మోలోజిస్ట్ రాజ్యలక్ష్మి, వ్యాపారవేత్త పెద్ది రమణరావు లాంఛనంగా ప్రారంభించారు. ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు జరిగే ఈ షోలో బ్రాండెడ్ జ్యూయలరీతో పాటు విశిష్ట ఆభరణాలను ప్రదర్శించనున్నారు. ఇందులో భాగంగా బంగారం, వజ్రాభరణాలు, జాతి రత్నాభరణాలను ప్రదర్శనలో ఏర్పాటు చేయనున్నారు. అద్వితీయమైన కళా నైపుణ్యతతో అంతులేని హుందాతనంతో పాటు నగిషీ చెక్కిన ప్రతి ఆభరణం తయారు చేసిన వారి అనుభవం ఇంకా కళాత్మకతకి నిదర్శనంగా నిలుస్తుందని స్టోర్ హెడ్ నదీర్, మార్కెటింగ్ మేనేజర్ గోపీకిరణ్‌లు తెలియజేశారు. ఆర్టిస్ట్రీ షోలో ప్రత్యేక ఆకర్షణ గా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ వారి షైన్ ధృవీకరించిన వజ్రాభరణాలు, వివాహం పార్టీ సంబరాల కోసం ఎరా అన్‌కట్ వజ్రాలతో పొదిగిన విశిష్ట శ్రేణి ప్రెస్యా జాతి రత్నాభరణాల సముదాయం ఎత్నిక్స్ హస్తకళ నైపుణ్యతతో తయారైన ఆభరణాలు జోల్ అధునాతన డిజైన్లతో తేలికపాటి ఆభరణాలను ఇష్టపడే మగువల మనసులు దోచుకుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మలబార్ ప్రతినిధులు ఎమ్‌టీ జిలిన్, పలువురు కస్టమర్లు ఉన్నారు.

దూరవిద్య కేంద్రం పీజీ ఫలితాలు విడుదల



పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న వర్సిటీ అధికారులు

పెదకాకాని, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో గత అక్టోబరు, నవంబరులో నిర్వహించిన పీజీ కోర్సులు పరీక్షల ఫలితాలను గురువారం ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే. గంగాధరరావు, ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య కే రత్నషీలామణి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జీ. సింహాచలంలు విడుదల చేశారు. ఈ సందర్భంగా దూరవిద్య కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డీ.రామచంద్రన్ మాట్లాడుతూ 1,2,3,4 సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేసామన్నారు. ఎంహెచ్ఆర్ఎం, ఎంఎల్ఐఎస్‌సీ, సోషల్ వర్క్, ఇంగ్లిష్, ఎకనామిక్స్, హిందీ, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సంస్కృతం, సోషియాలజీ, జర్నలిజం, ఎంకామ్ కోర్సుల ఫలితాలు విడుదలైనట్లు తెలిపారు.

దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వీ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఫలితాలను దూరవిద్యకేంద్రం వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షల అసిస్టెంట్ రిజిస్ట్రార్ డీ.కోదండపాణి మాట్లాడుతూ విద్యార్థులు రీవాల్యువేషన్ చేయించుకోవాలంటే ఆయా దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి ఒక్కో పేపరుకు రూ. 960 ఈ నెల 24లోగా చెల్లించి దూరవిద్య కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్‌కు దరఖాస్తు పంపాలన్నారు.

కార్యక్రమంలో ఓఎస్‌డీ ఆచార్య రవికుమార్, ఆచార్య త్రిమూర్తిరావు, పరీక్షల డిప్యూటీ రిజిస్ట్రార్ సయ్యద్ జైను లాబ్దిన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కృష్ణవేణి, సిబ్బంది టంక శాల వెంకటేశ్వర్లు, సీటీఏలు లావణ్య, ఉమామహేశ్వరరావు, వలి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రమీలా సెల్వరాజ్ జ్ఞాపకార్థ కూడిక



ప్రమీల సెల్వరాజ్ (ఫైల్)

పెదకాకాని,ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): బైబిలు మిషను స్త్రీల సభల కన్వీనర్, రెండో శనివారం ఉపవాస ప్రార్థనల వ్యవస్థాపక నిర్వాహకులు డాక్టర్ జే. ప్రమీలా సెల్వరాజ్ జ్ఞాపకార్థ కూడిక శుక్రవారం ఉదయం 10 గంటలకు పెదకాకాని స్వస్థిశాలలో ప్రారంభమౌతుందని ఆమె కుమారుడు, బైబిలుమిషను అధ్యక్షుడు జే.శామ్యేల్ కిరణ్, కుమార్తె అనీలా జోషి బైబిలుమిషను అధికారులు గురువారం ఒక ప్రకట నలో పేర్కొన్నారు. ఇప్పటికే కూడిక ఏర్పాట్లు పూర్తయి నట్లు వెల్లడించారు.

భక్తి, సేవకు అంకితం ప్రమీలా సెల్వరాజ్..

ప్రమీలా సెల్వరాజ్ చిన్నతనం నుంచే దైవభక్తి, ప్రార్థనల పట్ల ఆసక్తి కనబర్చారు. బైబిలు మిషను స్థాపకుడు ఫాదర్ ఎం. దేవదాస్ అయ్య ప్రభావంతో ఆ మార్గంలో ముందుకు సాగారు. గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాలలో బీఎస్సీ డిగ్రీ పూర్తి చేశారు. అనంతర కాలంలో ఆమె బైబిల్ మిషన్ 7వ అధ్యక్షుడు జే. జాన్ సెల్వరాజ్‌ని వివాహం చేసుకున్నారు. వారి కుటుంబం పూర్తిగా దైవసేవకు అంకితమైంది. ప్రమీలా సెల్వరాజ్ బైబిలు మిషను, గుంటూరు, బేతేలు గృహం ప్రధాన కేంద్రంగా దేశవ్యాప్తంగా అనేక మంది క్రైస్తవ విశ్వాసుల ప్రేమలను పొంది, బైబిల్ మిషన్ స్త్రీల సభలను 38 సంవత్సరాలుగా ప్రతి యేటా సెప్టెంబరులో సమర్థవంతంగా నిర్వహిస్తూ వచ్చారు. ఆమె 1987లో ఏర్పాటుచేసిన రెండో శనివారం ఉపవాస ప్రార్థనలు ఇప్పటికీ తోటలో కొనసాగుతున్నాయి.

దేశవ్యాప్తంగా అనేక మంది భక్తులు కాకాని స్వస్థిశాలకు వచ్చి, దైవదీవెనలు పొందేవారు. పెదకాకాని తోటలో ప్రతి సోమవారం స్వస్థత ప్రార్థనలు నిర్వహిస్తూ, వ్యాధి, బాధలలో ఉన్నవారికి ఓదార్పునిస్తూ, ధైర్యపరుస్తూ ఎందరో విశ్వాసులకు ప్రమీలా సెల్వరాజ్ ఆత్మీయ మార్గదర్శిగా నిలిచారు.

నామినేషన్లకు రెండు రోజులే..

- 7, 10 తేదీల్లో మాత్రమే అవకాశం
- 8, 9 తేదీల్లో రెండో శని, ఆదివారం సెలవుదినాలు

గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల నామినేషన్ల ఘట్టం తుది దశకు చేరుకొంది. 10వ తేదీ నామినేషన్ల దాఖలుకు ఆఖరు అయినప్పటికీ మధ్యలో రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలు కావడంతో శుక్ర, సోమవారం మాత్రమే అధికారులు నామినేషన్లు స్వీకరించనున్నారు. దీంతో ఈ రెండు రోజుల్లో ఎక్కువ మంది అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి వస్తారని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రధాన అభ్యర్థులైన ఎన్డీయే కూటమి బలపరిచిన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ శుక్రవారం ఉదయం నామినేషన్ అందజేయనున్నారు. మరోవైపు సిట్టింగ్ పీడీఎఫ్ బలపరిచిన ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సోమవారం నామినేషన్ వేస్తారని ఆయన కార్యాలయవర్గాలు తెలిపాయి. దీంతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయా లని పోలీసులకు ఆదేశాలు అందాయి.

ఈ నియోజకవర్గానికి నామినేషన్ల స్వీకార ప్రక్రియ ఈనెల 3వ తేదీ నుంచి ప్రారంభమైంది. ఇప్పటివరకు తొమ్మిది మంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సెలవు దినాల్లో నామినేషన్లను స్వీకరించరు. ఈ నేపథ్యంలో 8, 9వ తేదీల్లో అధికారులు నామినేషన్లను తీసుకోరు. దీని దృష్ట్యా శుక్ర, సోమవారాల్లోనే నామినేషన్ పత్రాలను ఆర్వో కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని అభ్యర్థులు గమనించాలని ఆర్వో ఎస్ నాగలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

ఎమ్మెల్సీ ఎన్నికలనిర్వహణ కోసం గుంటూరు కలెక్టరేట్‌లో 24గంటలు పనిచేసేలా కంట్రోల్ రూంని ఏర్పాటు చేశారు. నంబరు. 0863 2979766ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎన్నికలకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులు చేయడానికి, ఎన్నికల సమాచారం తెలుసుకోవడానికి కంట్రోల్‌రూంకి ఫోన్ చేయవచ్చని సూచించారు.

ఉద్యాన పంటలకు ఊతం







- ప్రభుత్వం నుంచి భారీగా రాయితీలు
- అధిక దిగుబడి.. మంచి లాభాలు
- సాగుకి ఆసక్తి చూపుతున్న రైతులు
- మండలంలో అధిక మొత్తంలో సాగు

ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా ప్రోత్సాహక రాయితీలు అందిస్తోంది. దీంతో అధిక సంఖ్యలో రైతులు ఉద్యాన పంటల సాగు వైపు మళ్లుతున్నారు. ముఖ్యంగా యువ రైతులు ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారు. నరసరావుపేట మండలంలోని ఉప్పలపాడు, అర్వపల్లి, పమిడిమర్రు, కొండకావూరు, గురవాయపాలెం గ్రామాలలో రైతులు ఉద్యాన పంటలసాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఎప్పుడూ సాగుచేసే మిరప, పత్తి, వరి పంటలకు ప్రత్యామ్నాయంగా రైతులు ఉద్యాన పంటలను సాగు చేసి అధిక లాభాలను ఆర్జిస్తున్నారు.

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 6, (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలంలో రైతులు ఇటీవల అత్యధికంగా డ్రాగన్‌ఫ్రూట్, అరటి, బొప్పాయి పంటలను సాగుచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రాగన్‌ఫ్రూట్ సాగుచేస్తున్న రైతులకు గతంలో 1 హెక్టారుకు 3 సంవత్సరాలకు ప్రోత్సాహక రాయితీగా రూ.30 వేలు అందిస్తుండగా ఈ సంవత్సరం నుంచి రూ. 2.7 లక్షలు అందిస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. మామిడి, స్వీట్ ఆరెంజ్, సిట్రస్ వంటి పండ్ల తోటలు సాగుచేస్తున్న రైతులకు గతంలో 1 హెక్టారుకు 3 సంవత్సరాలకు రూ.15 వేలు అందిస్తుండగా ఈ ఏడాది నుంచి రూ 50 వేలు అందించనున్నారు. అలాగే అరటి, సపోటా, జామ, ఆపిల్, జాక్‌ఫ్రూట్ పంటలను సాగుచేస్తున్న రైతులకు గతంలో 1 హెక్టారుకు రూ. 30 వేలు అందిస్తుండగా ఈ ఏడాది నుంచి రూ.70 వేలు ఇవ్వనున్నారు. దీంతో అధిక శాతం మంది రైతులు ఉద్యాన పంటలను సాగుచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. నరసరావుపేట మండలంలో మామిడి 90 హెక్టార్లు, దొండ తోటలు 80 హెక్టార్లు, టమాటా తోటలు 60 హెక్టార్లు, వంగ తోటలు 30 హెక్టార్లు, బంతి, చామంతి, లిల్లీ, కనకాంబరాలు పూలతోటలు 20 హెక్టార్లు, జామ, సపోటా, దానిమ్మ, అరటి తోటలు 50 హెక్టార్లలో సాగు అవుతున్నాయి. ఉద్యాన శాఖ అధికారులు నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ ఆయా పంటలపై రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలపై అవగాహన కలిగిస్తున్నారు. తద్వారా ఉద్యావన పంటల సాగు వైపు యువ రైతులు ఆసక్తి కనబరిచేలా కృషి చేస్తున్నారు.



ఉప్పలపాడు గ్రామంలో డ్రాగన్‌ఫ్రూట్ రైతులకు అవగాహన కలిగిస్తున్న జిల్లా ట్రైయిని కలెక్టర్ కల్పన శ్రీ, ఉద్యానశాఖ అధికారులు (ఫైల్ ఫోటో)







కూరగాయల సాగులో అధిక దిగుబడి



ఉద్యానశాఖ అందిస్తున్న రాయితీలతో కూరగాయల తోటలు సాగుచేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నాం. ఉప్పలపాడు గ్రామంలో టమాటా, వంగ, దొండ, మిరప సాగు చేస్తున్నాను. గతంలో కంటే ఇప్పుడు పంటల దిగుబడి బాగుంది. ఉద్యాన శాఖ అధికారులు ఎప్పటికప్పుడు మా తోటలను పరిశీలించి తగిన సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

తన్నీరు నాగేశ్వరరావు, రైతు, ఉప్పలపాడు

డ్రాగన్ ఫ్రూట్ సాగు లాభదాయకంగా ఉంది



డ్రాగన్ ఫ్రూట్ తోటలు సాగుచేస్తున్నాను. మిర్చి, పత్తి, వరి పంటల కంటే పెట్టుబడి ఖర్చు, శారీరక శ్రమ కూడా తక్కువే. డ్రాగన్ ఫ్రూట్ ధర మార్కెట్‌లో అధికంగా ఉంటుంది. దీంతో ఈ సాగు రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంది. డ్రాగన్ ఫ్రూట్ పంటలను సాగు చేస్తున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు రూ. 2.7 లక్షలు రాయితీని ప్రకటించింది.

- షేక్ సాంబశివరావు, రైతు, అర్వపల్లి

విజ్ఞాన్స్ మహోత్సవం 2కె25





సంగీత దర్శకులు ఎస్ఎస్ తమన్‌తో డాక్టర్ లావురత్తయ్య, తులసీరెడ్డి తదితరులు



జ్యోతి వెలిగించి వేడుకల్ని ప్రారంభిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య.

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): చూసేందుకు రెండు కళ్లు చాలనంత.. యువత గుండెల నిండా స్ఫూర్తి నింపేంత ప్రోత్సాహం. మది పులకించేలా సంగీత, సాంస్కృతిక హోరు. యువత ఆటలు, పాటలు, తుళ్లింతలు.. కేరింతలల నడుమ జాతీయ స్థాయి విజ్ఞాన్స్ మహోత్సవ్ గురువారం ప్రారంభమైంది.

చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ప్రారంభమైన ఈ వేడుకలకు భారీ సంఖ్యలో యువత హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ మాట్లాడుతూ యువత చదువుకే పరిమితం కాకుండా సంగీతం, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. చదువుతోపాటు సామాజిక సేవ, సానుకూల దృక్పథంతో మెరుగైన అవకాశాలు వస్తాయన్నారు. ఈనెల 15న విజయవాడలో జరగనున్న ఎన్టీఆర్ ట్రస్ట్ చారిటీ షోలో పాల్గొనాలని విద్యార్థులను కోరారు. గౌరవ అతిథిగా హాజరైన తులసి రెడ్డి మాట్లాడుతూ యువతలో అంతర్లీనంగా వున్న సృజనాత్మను వెలికి తీయడానికే ఈ మహోత్సవాలన్నారు. చదువు అంటే పుస్తకాలు ఒక్కటే కాదని, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా పాఠ్యాంశాలేనన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ప్రసంగిస్తూ మహోత్సవాలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఒకరితో మరొకరు ఎలా మెలగాలి? బృంద సమూహంగా ఎలా పనిచేయాలనే విషయాలు తెలుస్తాయన్నారు. ఎవరైతే ఇటువంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారో వారే అందరికంటే ముందుగా జీవితంలో స్థిరపడతారన్నారు. వేడుకల్లో వీసీ ఆచార్య పీ నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, విజ్ఞాన్ సీఈవో డాక్టర్ మేఘన తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం కార్యక్రమానికి హీరో విశ్వక్‌సేన్, హీరోయిన్ ఆకాంక్ష శర్మ, యాక్టర్ అభిమన్యు సింగ్ రానున్నారు.

మహోత్సవ్‌లో మొత్తం 80 ఈవెంట్లను నిర్వహించారు. తొలుత నిర్వహించిన స్పోర్ట్స్ ఫీట్‌లో వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, చెస్, అథ్లెటిక్స్, త్రోబాల్, ఫుట్‌బాల్, హాకీ, తైక్వాండో, ఖోఖో, ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్, యోగాసన వంటి తదితర క్రీడాంశాల్లో జాతీయస్థాయిలో విద్యార్థులకు పోటీలు ప్రారంభించారు. వీటితో పాటు మ్యూజిక్, లిటరసీ, స్పాట్‌లైట్, డాన్స్ డ్రమాటిక్స్ అండ్ ఫిల్మ్‌మేకింగ్, ఫ్యాషన్, ఫైన్ ఆర్ట్స్, కల్చరల్స్, థియేటర్ ఆర్ట్స్ తదితర పోటీలు నిర్వహించారు.





విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

పల్నాడు ఎక్స్‌ప్రెస్ లోకో ఫెయిల్యూర్

- 2 గంటల 25 నిమిషాలు ఆలస్యంగా వికారాబాద్‌కు చేరిక
- దీని ప్రభావంతో రిటర్న్ పల్నాడు రీషెడ్యూల్
- తీవ్ర ఇబ్బందులకు గురైన ప్రయాణికులు

గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ఎక్స్‌ప్రెస్ గురువారం ప్రయాణికులకు ప్రత్యక్ష నరకాన్ని చూపించింది. నంబరు. 12747 గుంటూరు నుంచి వికారాబాద్‌కు వేకువజామున 5.45కి బయలుదేరిన ఈ రైలు లోకో(ఇంజిన్)లో సాంకేతికలోపం తలెత్తింది. పిడుగురాళ్ల - నడికుడి సెక్షన్‌లో సమస్య తలెత్తడంతో అక్కడే గంటన్నరకు పైగా ఆలస్యమైంది. ఇక నల్గొండ - సికింద్రాబాద్ సెక్షన్‌లో మరింత ఆలస్యం కావడంతో దాదాపుగా 3.30 గంటల ఆలస్యంగా సికింద్రాబాద్‌కు చేరింది. అక్కడి నుంచి బయలుదేరి గమ్యస్థానమైన వికారాబాద్‌కు 2 గంటల 25 నిమిషాల ఆలస్యంగా చేరుకొంది. ఈ కారణంగా రిటర్న్ పల్నాడు ఎక్స్‌ప్రెస్ నంబరు. 12748 వికారాబాద్ - గుంటూరు రైలుని గంట 40 నిమిషాల ఆలస్యంగా బయలుదేరేలా రీషెడ్యూల్ చేశారు. అయితే ఆ సమయంలో రెగ్యులర్ రైళ్లకు పాత్ ఉండటంతో 10 గంటలకు కూడా మిర్యాలగూడ చేరుకోలేదు. ఈ రైలు గుంటూరుకు చేరుకోవడానికి అర్ధరాత్రి 12 గంటలు అవుతుందని రైల్వే ఎంక్వయిరీ సిబ్బంది తెలిపారు. దీంతో ఉదయం ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లిన ప్రయాణీకులు, మధ్యాహ్నం అటు నుంచి గుంటూరుకు బయలుదేరి వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లిలో దిగి వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణీకులకు ఆయా స్టేషన్లలో లింకు బస్సులు వెళ్లిపోవడంతో చేసేది లేక ఆటోలలో బయలుదేరాల్సిన పరిస్థితి తలెత్తింది.

ఆరబెట్టిన మిర్చిని తీసుకురావాలి

- రైతులకు మిర్చియార్డు కార్యదర్శి చంద్రిక సూచన



మిర్చియార్డులో సిబ్బందితో కలిసి పర్యటిస్తున్న సెక్రెటరీ చంద్రిక

గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రైతులు మిరప కాయలను బాగా ఆరబెట్టిన తర్వాతే మిర్చి యార్డుకు తీసుకురావాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరు ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రిక సూచించారు. గురువారం ఆమె యార్డు సిబ్బందితో కలిసి మార్కెట్ కమిటీ ప్రాంగణంలో పర్యటించారు. పలుచోట్ల కమీషన్ దుకాణాల ఎదుట మిర్చిని ఆరబోసి ఉండటాన్ని ఆమె గమనించారు. రైతులు తీసుకొచ్చే మిర్చిలో తేమ శాతం ఉండకుండా చూసుకోవాలన్నారు. అలానే యార్డు ప్రదేశంలో మిర్చి ఆరబెట్టడం వలన ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందన్నారు. అనంతరం భోజనశాలని సందర్శించి రైతులకు వడ్డిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతని పరిశీలించారు. కార్యక్రమంలో వివిధ గ్రేడ్‌ల సెక్రెటరీలు సుబ్రహ్మణ్యం, ఆంజనేయ సింగ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అమృత్ 2.0.. ఆమోదం

(5వ పేజీ తరువాయి)

స్థానిక సంస్థ వాటా నిధులను 15వ ఆర్థిక సంఘం నుంచి వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో మునిసిపాలిటీలపై నిధుల భారం తప్పనుంది.

గతంలో నిలిచిన పనులకు మోక్షం

అమృత్ పథకం కింద చిలకలూరిపేటలో రక్షిత మంచి నీటి పథకం విస్తరణ టీడీపీ హయాంలో రూ.145 కోట్లతో చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం నిధులను నిలిపివేయడంతో పనులు ఆగిపోయాయి. దీంతో ఈ పథకాన్ని అమృత్ 2.0 కింద చేర్చారు. రూ.116 కోట్లతో పథకాన్ని పూర్తి చేసేలా అంచనాలను రూపొందించారు. చిలకలూరిపేట తరహాలోనే ఇతర మున్సిపాల్టీలలో నిధుల కొరతతో నిలిచిపోయిన పనులను పూర్తిచేసేందుకు డీపీఆర్‌లు సిద్ధం చేశారు. మున్సిపాల్టీలలో రానున్న 25 ఏళ్ల ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి పథకాలను విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి.

కలుషిత జలాలు శుద్ధి..

తాగునీటి పథకాల అభివృద్ధితో పాటు మురుగునీటి సమస్యలను పరిష్కరించేందుకు అమృత్‌పథకంలో పెద్దపీట వేస్తున్నారు. మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం చేపడుతున్నారు. గుంటూరు, నరసరావుపేట పట్టణాల్లో ఇప్పటికే భూగర్భ డ్రెయినేజ్ పథకాలు ఉన్నాయి. మిగతా మున్సిపాల్టీలలో మురుగు నీరు వాగుల్లో కలసి జలాలు కలుషితం అవుతున్నాయి.దీనిని పూర్తిగా నిరోధించేందుకు ప్రతి మున్సిపాల్టీలో మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం చేపట్టనున్నారు. ప్లాంట్లను నిర్మించి మురుగు నీటిని శుద్ధి చేసిన అనంతరం నీటిని బయటకు పంపుతారు. మునిసిపాలిటీల పరిధిలో ఉన్న తాగునీటి చెరువులను కూడా అభివృద్ధి చేయనున్నారు. భూగర్భ జలాలు పెంచే దిశగా చెరువులను పునరుద్ధరించనున్నారు.

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి 98484 11050 99854 03281

పశ్చిమ డెల్టాకాల్వకు 1818 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1818 క్యూసెక్కుల సాగునీటిని గురువారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.8 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 46 క్యూసెక్కుల నీరు, రేపల్లె కాల్వకు 170 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 152 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 110 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 40 క్యూసెక్కులు, కొమ్మమూరుకాల్వకు 1110 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

311 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డులో గురువారం జరిగిన వేలంలో 311 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,300 గరిష్ఠధర రూ.9,300 మోడల్‌ధర రూ.9,300 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.9,300, గరిష్ఠధర రూ.9,300 మోడల్ ధర రూ.10,700 పలికాయి.

సీఆర్డీఏ గ్రీవెన్స్ డే రద్దు


తుళ్లూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి శుక్రవారం తుళ్లూరులోని సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్ డే కార్యక్రమం కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా రద్దు చేసినట్టు గురువారం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వ ప్రాధాన్యం



మాజీ ఎమ్మెల్సీ వీవీఎస్ చౌదరితో శాప్ చైర్మన్ రవినాయుడు

తాడేపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని క్రీడాకారులకు అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో క్రీడాసౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తుందని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు వివరించారు. టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ వీవీఎస్ చౌదరిని తాడేపల్లిలోని వారి నివాసంలో శాప్ చైర్మన్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో చేపడుతున్న క్రీడల అభివృద్ధితోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి వారివురు చర్చించారు.



దుగ్గిరాల జడ్పీ బాలికోన్నత పాఠశాల నుంచి పదోతరగతి కామన్ పరీక్షలకు హాజరుకానున్న 88 మంది విద్యార్థినులకు పరీక్ష సామగ్రిని అందించారు. పద్మాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చుండూరు భాస్కరరావు సౌజన్యంతో హెచ్ఎం శోభాదేవి చేతుల మీదుగా పరీక్ష అట్ట, 2 పెన్నులు, స్కెచ్‌పెన్, కంపాస్, ఇతర పరీక్ష ఉపకరణాలను అందించారు. మరో 360మంది విద్యార్థినులకు ఒక్కో పెన్ను చొప్పున అందించారు. **(దుగ్గిరాల)**

జనసైనికుడు అంజి కుటుంబానికి చేయూత



నగదు అందజేస్తున్న జనసేన నాయకులు

తాడేపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వడ్డీ వ్యాపారుల ఒత్తిడికి గురై కొన్ని రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్న ఉండవల్లి గ్రామానికి చెందిన జనసైనికుడు యండ్రపల్లి ఆంజనేయులు కుటుంబ సభ్యులు జనసైనికులు అండగా నిలిచారు. ఏపీ ఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఉండవల్లిలోని అంజి కుటుంబసభ్యులను పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. పార్టీ తరపున అంజి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, నియోజకవర్గ నాయకులు జొన్నా రాజేష్, రాష్ట్ర ఐటీ కోఆర్డినేటర్ చవ్వాకుల కోటేష్, జిల్లా సంయుక్త కార్యదర్శి బడే కోమలి, ఉండవల్లి గ్రామ అధ్యక్షుడు శిగిరిశెట్టి రాజరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని ఆత్మహత్య

గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని లాలుపురానికి చెందిన వేములపల్లి ఉదయ్ ఫణీంద్ర (34) ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నల్లపాడు సీఐ కే వంశీధర్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయ్ ఫణీంద్ర స్థానిక లక్ష్మీపురంలోని కరెంట్ ఆఫీసులో షిఫ్ట్ ఆపరేటర్‌గా అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నాడు. కొంత కాలంగా మెదడులో నరాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ఉదయ్ ఫణీంద్ర గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య మాధవి ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఫణీంద్రకు కుమారుడు, కుమార్తె ఉన్నారు

గుర్తుతెలియని వ్యక్తులకు గాయాలు

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. మేడికొండూరు నుంచి సత్తెనపల్లి వెళ్లే మార్గంలో ఈ ప్రమాదం జరిగింది. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. జీజీహెచ్‌లో వారు చికిత్స పొందుతున్నారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

ప్రత్తిపాడులో ఆధార్ కష్టాలు

- రెండు సచివాలయాల్లో మూతబడ్డ కేంద్రాలు
- ఒక్కసెంటర్‌తోనే నెట్టుకొస్తున్నవైనం
- పాఠశాలల్లో ఇంకా కాని అపార్
- ఏడాది నుంచి పెండింగ్‌లో బాలాధార్‌లు



ప్రత్తిపాడు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆధార్ కష్టాలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ఎక్కడ ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయో.. ఎక్కడికి వెళ్లాలో తెలియక ప్రజలు ఇబ్బందు పడుతున్నారు. సచివాలయాలలో పనిచేయాల్సిన ఆధార్ కేంద్రాలు మూతబడిపోవడం, బయట మరెక్కడా అందుబాటులోకి రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుంది. ప్రస్తుతం ఆధార్ అవశ్యకత విపరీతంగా పెరిగిపోయింది. గతంలో ఆధార్ కార్డు ఆవశ్యకత అర్థంకాక పోవడం, ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ సమయంలో సిబ్బంది చేసిన తప్పులు మొత్తం ఇప్పుడు ప్రజలు సరిదిద్దుకోవాల్సి వస్తుంది. దీనికి తోడు ఫోన్ నెంబర్ల లింకుతో పాటు అప్‌డేట్ చేసుకోవాల్సిన అవసరం అనివార్యమైంది. ఈ పరిస్థితుల్లో ఆధార్ సెంటర్ ఆవశ్యకత పెరిగిపోయింది. దీనికి తగ్గట్టుగా ఆధార్ కేంద్రాలు అందుబాటులో లేకపోవడం, సచివాలయాల్లో ఉన్న సెంటర్లను మూసివేయడంతో ప్రజల కష్టాలు వర్ణణాతీతం.

సచివాలయ వ్యవస్థ ఏర్పడ్డ తరువాత మండలంలో మూడు ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రత్తిపాడుతో పాటు నడింపాలెం, పాతమల్లాయపాలెంలలోని సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను నిర్వహించాల్సి ఉంది. ఇందుకు గాను ప్రభుత్వమే ఫీజులు కట్టి సిబ్బందిని ఆధార్ ఆపరేటర్ల పరీక్షలు రాయించింది. ఆ విధంగా పరీక్షలు పాసైన వారితో ఆధార్ కేంద్రాలను నిర్వహిస్తుంది. ఆధార్ ఆపరేటర్లకు మరే విధులు కేటాయించకుండా కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలో కేవలం ప్రత్తిపాడులోని ఒక్క సెంటర్ మాత్రమే పనిచేస్తుంది. మిగిలిన రెండు సెంటర్లు మూతబడ్డాయి. మండలంలో ఆధార్ పరీక్ష పాసై ఆపరేటర్‌గా అవకాశం ఉన్న సిబ్బంది కూడా ఉన్నారు. వారికి ఆధార్ విధులు కేటాయించక పోవడంతో రెండు ఆధార్ సెంటర్లు మూలనపడ్డాయి. ఫలితంగా మండలంలో పాతమల్లాయపాలెం, నడింపాలెం ఏరియాల్లోని పాఠశాలల్లో అపార్ ఇంతవరకు పూర్తి కాలేదు. అంతే కాకుండా ప్రత్తిపాడులో ఉన్న ఒక్క సెంటర్ పాఠశాలలు, క్యాంపులకు తిరుగుతుండటంతో ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారో కూడా ప్రజలకు అర్థం కాని పరిస్థితి ఉంది. దీనికి తోడు ప్రత్తిపాడు సచివాలయంలో ఉన్న ఆధార్‌సెంటర్ ఆపరేటర్‌కు మండల పరిషత్ అధికారులు సర్వే డ్యూటీలు అప్పగిస్తున్నారు. జియోట్యాగింగ్, ఎన్‌పీసీఐ, ఎంఎస్ఎంఈ, ప్యాక్స్ అంటూ వివిధ రకాల సర్వేలు అప్పగించడంతో టార్గెట్ పూర్తి చేయడం కోసం ఆధార్ సెంటర్ సేవలను ఆపేయాల్సి వస్తుంది.

ఏడాది నుంచి పెండింగ్‌లో బాలాధార్‌లు

మండలంలో ఏడాది నుండి బాలాధార్‌లు పూర్తిస్థాయిలో పెండింగ్‌లో ఉన్నాయి. ప్రతి ఏడాది ఆరోగ్య శాఖ ద్వారా బాలాధార్ లిస్టు మండలాలకు వస్తుంది. ఆ లిస్టు ఆధారంగా మండల పరిషత్, ఐసీడీఎస్ సమన్వయంతో బాల, బాలికల తల్లిదండ్రులను గుర్తించి చిన్నారులకు బాలాధార్ ఇవ్వాల్సి ఉంది. అయితే ఏడాదిగా అధికారులు ఆ దిశగా అడుగులు వేయలేదు. సుమారు వెయ్యి వరకు మండలంలో పెండింగ్‌లో ఉన్నాయి. అందులో కొంత మంది తల్లిదండ్రులు బాలాధార్ తీసుకున్నప్పటికీ అవగాహన లేని ఎక్కువ మంది బాలాధార్ తీసుకోలేదు. దీని వల్ల పాఠశాలల ప్రవేశం సమయంలో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతుంది. సచివాలయ సిబ్బందితో పనులు చేయించాలనే సదుద్దేశ్యంతో జీతాలకు కౌంటర్ సంతకం అంటూ కర్రపెత్తనం తీసుకున్న మండలపరిషత్ అధికారులు సిబ్బందికి విధులు కేటాయించి మూతబడ్డ ఆధార్ సెంటర్‌లను వినియోగంలోనికి తీసుకువస్తే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

కేఎల్‌యూలో అమెరికా యూనివర్సిటీ బృందం పర్యటన



అవగాహన ఒప్పంద ప్రతాలను మార్చుకుంటున్న కేఎల్‌యూ డీన్ ఎం కిషోర్‌బాబు, అమెరికా యూనివర్సిటి డీన్ కెవిన్‌జెడ్ ట్రూమాన్

తాడేపల్లి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన యూనివర్సిటి ఆఫ్ మిస్సోరీ-కాన్సాస్ సిటీ, యూఎస్ఏ స్కూల్ ఆఫ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ డీన్ కెవిన్ జెడ్ ట్రూమాన్.. అంతర్జాతీయ సంబంధాల డైరెక్టర్ డాక్టర్ మార్క్ డాలీ, యూఎస్ఏలోని సౌత్ ఆసియా ఇంటర్నేషనల్ మేనేజర్ దీపికా పుకాన్ వారి బృంద సభ్యులు గురువారం నాడు స్థానిక వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటిని సందర్శించారు. యూనివర్సిటి ఆఫ్ మిస్సోరీ - కాన్సాస్ సిటీ, యూఎస్ఏలోని సౌత్ ఆసియా ఇంటర్నేషనల్ మేనేజర్ దీపికా పుకాన్‌తో అనుబంధించబడిన స్కూల్ ఆఫ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ కెవిన్ జెడ్ ట్రూమాన్.. అంతర్జాతీయ సంబంధాల డైరెక్టర్ డాక్టర్ మార్కడాలీ, కేఎల్‌యూను సందర్శించిన వారిలో ఉన్నారు. అనంతరం వారు కేఎల్‌యూ తమ యూనివర్సిటీకి ఉన్న దశాబ్ద కాలంనాటి ఒప్పందాలను మరో ఐదేళ్లకు పొడిగిస్తూ అవగాహనా ఒప్పందం కుదుర్చుకొని ఒప్పంద పత్రాలపై ఇరు యూనివర్సిటిల ప్రతినిధులు సంతకాలు చేసి పత్రాలు మార్చుకున్నట్టు కేఎల్‌యూ అంతర్జాతీయ సంబంధాల డీన్ ఎం కిషోర్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు యూనివర్సిటీల బృందాలు కలిసి వివిధ అంశాలపైన జరుపుతున్న పరిశోధనల సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంపై చర్చలు జరిపినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేఎల్‌యూ అంతర్జాతీయ సంబంధాల డీన్ ఎం కిషోర్‌బాబు, డైరెక్టర్ వినయ్ మారుతి, డిప్యూటి డైరెక్టర్ గోపి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

10న నులిపురుగుల నివారణ దినోత్సవం

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవం ఈ నెల పదో తేదీన జరుగుతుందని అడిషనల్ కమిషనర్ కే.శకుంతల తెలిపారు. ఈ మేరకు ఎంటీఎంసీ కార్యాలయంలో గురువారం ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణీపై టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఆల్‌బెండజోల్ మాత్రలు పిల్లలకు ఎలా పంపిణీ చేయాలి, పాఠశాలలకు పిల్లలు గైర్హాజరు కాకుండా తీసుకోవాల్సిన చర్యలను గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో పీహెచ్‌సీ వైద్యురాలు పీ అనూష, మంగళగిరి, తాడేపల్లి విద్యాశాఖ అధికారులు ఎన్ బాబు, నాగేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, ఎంపీహెచ్‌వో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉన్న చోటనే పట్టాలు మంజూరు చేయాలి

తాడేపల్లి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కొన్ని దశాబ్దాలుగా రైల్వే, ఫారెస్ట్, పేడబ్ల్యూడీ, కొండ పోరంబోకు భూముల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని అనేక మంది పేదలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు వెనుకబడిన వర్గాల అందరూ జీవిస్తూ ఉన్నారని సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య అన్నారు. గురువారం సాయంత్రం తాడేపల్లిలోని రైల్వే స్థలాల్లో నివాసముంటున్న పేదల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కాశయ్య మాట్లాడుతూ ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం 5 లక్షలు ఇస్తామని చెప్పిందని, అయితే ఆ ఇల్లు కట్టుకోవడానికి పట్టా కావాలని పట్టా లేకుండా ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం డబ్బులు ఇవ్వదని, బ్యాంకులు లోన్లు ఇవ్వవని అన్నారు. రైల్వే, ఫారెస్ట్, ఇరిగేషన్, కొండ పోరంబోకు స్థలాల్లో నివసిస్తూ వారందరికి గతంలో చంద్రబాబు, లోకేశ్ చెప్పినట్టు స్థలాలు ఇచ్చి శాశ్వత పట్టాలు ఇవ్వాలని సీపీఐ పోరాటం చేస్తుందని చెప్పారు. 40 సంవత్సరాలుగా ఉంటున్న పేదలకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. పేద ప్రజల నుండి సీపీఐ ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరిస్తునట్టు చెప్పారు. మంత్రి నారా లోకేశ్ జోక్యం చేసుకుని ఇళ్ల పట్టాల కార్యక్రమాన్ని పూర్తి చేయాలని కోరుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, నాయకులు మానికొండ డాంగే, శ్యామ్, మేరిమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థిపై శ్రద్ధ తీసుకోవాలి

● ఎంఈవో కెన్నడీ

కాకుమాను, ఫిబ్రవరి 6: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో కేఎఫ్ కెన్నడీ ఉపాధ్యాయులకు సూచించారు. కాకుమానులో ఎంపీపీ(బీసీ) పాఠశాలను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో నూరుశాతం విద్యార్థుల హాజరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల మధ్యాహ్న భోజనం ఉపాధ్యాయుల పర్యవేక్షణలో నిర్వహించాలని సూచించారు.

గత ప్రభుత్వ పాలనలో ప్రాథమిక విద్యారంగం నిర్వీర్యం

● మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ



దుగ్గిరాల హైస్కూల్లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ

దుగ్గిరాల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలో వైసీపీ పాలనలో ప్రాథమిక విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిందని మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ అన్నారు. దుగ్గిరాలలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు కోరుతూ గురువారం ప్రచారం నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయులను కలిసిన రామకృష్ణ మాట్లాడుతూ, 5వేల మోడల్ స్కూళ్లను తీసివేసి, 117జీవో ద్వారా ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను హైస్కూల్లో చేర్చడం విద్య తిరోగమనానికి దారితీసిందన్నారు. తీవ్రమైన ఒత్తిడి, వేధింపులతోనూ, పలువురు ఉపాధ్యాయులు గుండెపోటుకు గురయ్యారన్నారు. సహజమైన పరిస్థితుల్లో ఉపాధ్యాయులు బోధన చేయాలని, విద్యార్థులు చదువుకోవాలన్నారు. గతంలో సాంకేతికశాఖ మంత్రిగా, తెనాలి ఎమ్మెల్యేగా పనిచేసిన విశేష అనుభవం కలిగిన ఆలపాటి కూటమి అభ్యర్థిగా గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. నాడు.. నేడులో చేపట్టిన పనుల్లో ఖర్చు చేసిన దానికంటే ఎక్కువ బిల్లులు చేయాలని ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి చేశారని, అనేక మందిని సస్పెండ్ చేశార్నారు. రాబోయే రోజుల్లో దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను నిలబెడతామన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను(ఏఐ) విద్యలో భాగం చేసేందుకు మనరాష్ట్రంలోనూ విశ్వవిద్యాలయాన్ని స్థాపించనున్నట్లు చెప్పారు. తెలుగు మీడియంను పూర్తిగా ఎత్తివేయడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. వల్లూరు నరసింహారావు, పసుపులేటి రవియాదవ్, నక్కా చిరంజీవి, పర్వతనేని హర్షవర్ధన్ పలువురు టీడీపీ నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

● ఏఎన్‌యూ ఇన్‌చార్జి రెక్టార్ రత్నషీలామణి



ప్రతిభావంతులైన విద్యార్థులతో రెక్టార్ రత్నషీలామని, డీటీసీ సీతారామిరెడ్డి, రఘురామ్ తదితరులు

గుంటూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక యుగంలో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అందించినప్పుడే వారు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఇన్‌ఛార్జ్ రెక్టార్ రత్న షీలామణి కోరారు. శ్రీవెంకటేశ్వర బాలకుటీర్ (బ్రాడీపేట) 60వ వార్షికోత్సవ వేడుకలు శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గురువారం సాయంత్రం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన రెక్టార్ కే రత్నషీలామణి మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి గురువులు, తల్లిదండ్రులు కృషి చేసినప్పుడే వారు ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ కె సీతారామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే యువత ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, అప్పుడే ప్రమాదాల నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. వాహన చోదకులందరూ హెల్మెట్ ధరించాలని, అతివేగం ప్రమాదకరమన్నారు. పాఠశాల కరస్పాండెంట్ దుర్గారఘురామ్ మాట్లాడుతూ ప్రస్తుతం గాడ్జెట్స్ ద్వారా విద్యార్థులు పక్కదారి పడుతున్నారని, వాటికి వారిని దూరంగా ఉంచాల్సిన బాధ్యత పెద్దలదేనన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

హెల్మెట్‌తో ప్రయాణం జీవిత గమ్యానికి శ్రీరామ రక్ష

● మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు : ఎస్ఐ సుబ్బారావు

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహన ప్రయాణం హెల్మెట్ ధరించటం ద్వారా మాత్రమే మన గమ్యానికి శ్రీరామ రక్షగా ఉంటుందన్న విషయాన్ని ద్విచక్ర వాహన చోదకులు గుర్తించాలని వట్టిచెరుకూరు ఎస్ఐ సుబ్బారావు సూచించారు. ద్విచక్ర వాహన చోదకులతో పాటు వెనుకున్న వారు కూడా హెల్మెట్ ధరించటం, మద్యం తాగి వాహనం నడపటంవల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ గురువారం సాయంత్రం మండలంలోని లేమల్లెపాడు, అనంతవరప్పాడు గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఎస్ఐ సుబ్బారావు, రైటర్ శ్రీనివాస్‌నాయక్, పలువురు పోలీసులతో వాహనదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల ఏటుకూరు సమీపంలో హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై మితిమీరిన వేగం, ముగ్గురు ప్రాణాలను బలికొనటమే కాకుండా తమ బిడ్డలను అనాథలను చేశారని, కుటుంబానికి తీరని దుఃఖాన్ని మిగిల్చారన్నారు. ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం సాగిస్తే జరిమానాతో పాటు కఠిన శిక్షలు ఉంటాయన్నారు.



వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సుబ్బారావు

రాజీవ్‌రంజన్ మిశ్రాను కలిసిన ఉండవల్లి శ్రీదేవి



రాజీవ్‌రంజన్ మిశ్రాను కలిసిన ఉండవల్లి శ్రీదేవి

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఏక సభ్య కమిషన్ ఎస్సీ రిజర్వేషన్ చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రాను మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి గురువారం ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో కలిశారు. పలువురు కార్పొరేషన్ డైరెక్టర్లతో కలిసి ఆమె మిశ్రాతో మాట్లాడుతూ మాదిగ ఉపకులాల వెనుకబాటుతనం ఆర్థిక స్థితిగతులను గురించి సమాజంలో వారి అసమానతల గురించి వివరించారు. త్వరితగతిన ఎస్సీ రిజర్వేషన్ చేయాలని ఎస్సీ కేటగిరిలో ఉన్న అన్ని మాదిగ, మాదిగ ఉపకులాలకు సామాజిక న్యాయం చేసి లోపాలు సవరించాలని కోరారు. ఈ సందర్భంగా వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ కుమార్, విజయశేఖర్, సుజాత, వెంకటరావు, మునియ్య, మల్లేష్ తదితర నేతలు పాల్గొన్నారు.

విజయకీలాద్రిపై హయగ్రీవ హోమం

● మంగళశాసనాలు అందించిన చినజీయర్ స్వామి



స్వామివార్ల ఊరేగింపును ప్రారంభిస్తున్న చినజీయర్ స్వామి

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): వేద విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు శ్రీత్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంలో 8వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. సకల విద్య ప్రాప్తి కోసం హయగ్రీవ హోమం, పూర్ణాహుతి, హనుమత్వాహన సేవలు, అర్చకులు నిర్వహించారు. అనంతరం సాయంత్రం అశ్వవాహన సేవ కన్నుల పండువగా జరిగింది. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు చినజీయర్ స్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో అర్చకులు శ్రీనివాసాచార్యులు, అనంతస్వామి, వేదవిద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాభివృద్ధికి తోడ్పాటు అభినందనీయం

● జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి సుబ్బరత్నం



దుగ్గిరాల గ్రంథాలయంలో పాఠకులనుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి సుబ్బరత్నం

దుగ్గిరాల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : వందేళ్ల చరిత్ర గల్గిన దుగ్గిరాల శాఖా గ్రంథాలయ అభివృద్ధికి సహకరించడం అభినందనీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బీ సుబ్బరత్నం అన్నారు. దుగ్గిరాలలోని గ్రంథాలయం మరమ్మతులు, రంగులు వేసేందుకు ఆర్థిక సహకారం అందించిన ఎన్నారై జంపాల సుబ్బారావును గురువారం సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు. గ్రంథాలయాధికారి జ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుబ్బరత్నం మాట్లాడుతూ వేలాది మందికి విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను ప్రజలకు అందుబాటులో ఉంచుతూ, సేవలందించిన గ్రంథాలయాన్ని కాపాడుకునేందుకు సిద్ధమైన సుబ్బారావు వంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. గతంలోనూ పలువురు దాతలు గ్రంథాలయ అభివృద్ధికి తోడ్పడ్డారని అన్నారు. దాతల స్ఫూర్తితో భావి తరాలకు ముమ్మందు గ్రంథాలయం మెరుగైన సేవలు అందిస్తుందన్నారు. ప్రొఫెసర్ బీ లలితానంద, కొండపనేని రవీంద్రరావు, వల్లూరు నరసింహారావు, పర్వతనేని హర్షవర్ధన్, పసుపులేటి రవియాదవ్, అత్తోట ధనుంజయ, జంపాల తిరుమల, చిలకా ప్రేమానందం, భూషణం తదితరులు పాల్గొన్నారు.


సమాజ సేవలో చలపతి ఐటీ హబ్ విద్యార్థులు



విద్యార్థులకు బ్లాంకెట్స్, పుస్తకాలు, పెన్నులు అందిస్తున్న చలపతి విద్యార్థులు

తాడికొండ(లాం), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగానికి ఐటీ హబ్ అసోసియేషన్ విద్యార్థులు సమాజ సేవ చేస్తూ పలువురికి ఆదర్శంగా ఉంటున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం గుంటూరులోని మల్లికార్జునపేట, రాజీవ్‌గాంధీ నగర్‌లోని సెయింట్‌ఆన్స్ మనోవికాస్ కేంద్రం స్కూల్లోని విద్యార్థులకు బ్లాంకెట్స్, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజంపై బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అనాథలు, వృద్ధులపై గౌరవంగా ఉంటూ వారికి కావాల్సిన సహాయ సహకారాలను అందించాలన్నారు. చిన్ననాటి నుంచి సమాజంపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు చేస్తున్న సమాజ సేవను గుర్తించిన కళాశాల సెక్రటరి వై సుజిత్‌కుమార్ వారిని అభినందించారు. కార్యక్రమంలో ఐటీ హబ్ విభాగాధిపతి జే భార్గవ్, ఐటీ హబ్ అసోసియేషన్ తృతీయ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

పౌరసరఫరాల గోదాము తనిఖీ



గోదామును తనిఖీ చేస్తున్న అధికారులు

మంగళగిరి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మంగళగిరి నిడమర్రురోడ్డులోని పౌరసరఫరాలశాఖ గోదాములో అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్ గౌర్, జాయింట్ కలెక్టర్ భార్గవతేజ ఎంఎల్ఎస్ పాయింట్‌ను సందర్శించి నిల్వలను పరిశీలించారు. స్టాకు వివరాలు, చౌకడిపోలకు తరలించే విధానాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్వో పద్మ, డీఎం జీ లక్ష్మీ, మంగళగిరి తహసీల్దారు దినేష్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం



అష్రఫ్ కుటుంబసభ్యులకు చెక్కు అందజేస్తున్న శ్రీనివాసరావు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లికి చెందిన సయ్యద్ అష్రఫ్ గొంతు శస్త్ర చికిత్స నిమిత్తం ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు ఆర్థికసాయం అందజేశారు. మంగళగిరి ఆటో నగర్‌లోని ఏపీఎంఎస్ఐడీసీ కార్యాలయంలో గురువారం అష్రఫ్ కుటుంబ సభ్యులకు రూ.20 వేల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఎంటీఎంసీ అధ్యక్షుడు మునగపాటి మారుతీరావు, నేతలు చవ్వాకుల కోటేష్‌బాబు, బడే కోమలి, సామల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME
I, NARAHARI PRASAD SAI HEMANTH (Old Name), S/o.Narahari Prasad, R/o. Flat No.4, Lotus Residency, 1/3rd Lane, Navabharat Nagar, Guntur-522006. Changed my name from NARAHARI PRASAD SAI HEMANTH (Old Name) to NELAKUDITI SAI HEMANTH (New Name) henceforth i am being called as NELAKUDITI SAI HEMANTH (New Name) for all purposes.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి 99854 11227 99854 02292

కౌన్సిలర్‌పై హత్యాయత్నం కేసు నమోదు

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కారులో కిడ్నాప్ చేసి దాడిచేసిన వైసీపీ కౌన్సిలర్ మొఘల్ అహ్మద్‌బేగ్ అతనికి సహకరించిన నిందుతులపై హత్యాయత్నం కిడ్నాప్ కేసులు నమోదు చేసినట్లు త్రీ టౌన్ సీఐ రమేష్‌బాబు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో తెనాలి బాలాజీరావుపేటకు చెందిన కార్పెంటర్ షేక్ మస్తాన్‌వలిని వైసీపీ కౌన్సిలర్ మొఘల్ అహ్మద్ బేగ్ కారులో కిడ్నాప్ చేసి హత్యాయత్నానికి యత్నించారు. గాయపడి చికిత్స పొందుతూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితులు పరారీలో ఉన్నారని వారిని గాలిస్తున్నట్లు త్రీటౌన్ సీఐ రమేష్ బాబు తెలిపారు.

పట్టపగలు గృహంలో చోరీ

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టపగలు ఇంట్లో చోరీచేసిన ఘటన మారీసుపేటలో కలకలం రేకెత్తించింది. బాధితురాలి కథనం మేరకు గురువారం స్థానిక మారీసుపేట మఠంబజార్‌కు చెందిన షేక్ షాహినాబేగం ఇంటికి తాళంవేసి పని మీద బయటకు వెళ్లింది. ఇదే క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలు గొట్టి లోపలికి వెళ్లి బీరువాలోని లక్ష రూపాయల నగదు సుమారు 9సవర్ల బంగారం చోరీ చేశారు. దీనిపై త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపింది.

అర్బన్ బ్యాంకు డిపాజిట్లపై 9 శాతం వడ్డీ

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీబీ రోడ్డు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు సీనియర్ సిటిజన్ల డిపాజిట్లపై 9 శాతం వడ్డీ అందిస్తున్నామని బ్యాంకు ఛైర్మన్ మంగమూరి హరిప్రసాదరావు చెప్పారు. గురువారం బ్యాంకు కార్యాలయంలో నూతన వడ్డీ రేట్ల కరపత్రాలను విడుదల చేశారు. ఏడాది పైబడిన సాధారణ డిపాజిట్లపై 8.50శాతం, ఏడాది లోపు డిపాజిట్లకు 7శాతం, ఆరు నెలల డిపాజిట్‌కు 6.25శాతం, మూడు నెలలకు 5శాతం వడ్డీ లభిస్తుందని, సీనియర్ సిటిజన్లకు 0.50 శాతం అదనంగా చెల్లిస్తామన్నారు. బంగారు ఆభరణాల రుణాలకు 79 పైసలు వడ్డీ పడుతుందని, గ్రాముకు రూ.5300 వరకు రుణం ఇస్తామని ప్రభుత్వ ఉద్యోగులకు పర్సనల్ లోన్, ఇళ్ల స్థలాలకు, ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసిన వెంటనే రుణాల మంజూరును సరళతరం చేశామన్నారు. డైరెక్టర్లు దొప్పలపూడి శ్యామ్, నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పంచముఖ ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): షరాఫ్ బజారులోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 8 నుంచి 14 వరకు జరుగుతాయని ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో గురువారం కరపత్రాలను విడుదల చేశారు. విశేష పూజలు, వాహన సేవలు, ప్రతిరోజు నిర్వహిస్తామన్నారు. స్వామివారి ఉత్సవాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు. 11న స్వామి కళ్యాణం, 12న రథోత్సవం జరుగుతాయన్నారు. నిఖిల్ శాండిల్య, రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, కిరణ్‌కుమార్, సురేష్, శివ, వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

100 మంది ఏఎస్‌ఎన్ డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగాలు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు చెందిన ఐఎల్ఎం కంపెనీకి ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు 100 మంది ఎంపికయ్యారని విద్యా సంస్థల ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ లాంగ్వేజ్ మేనేజ్‌మెంట్ సంస్థ, బీకాం, బీసీఏ చదువుతున్న విద్యార్థులను క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎంపిక చేసిందన్నారు. ఏప్రిల్‌లో ఉద్యోగాల్లో చేరే విద్యార్థులకు నెలకు రూ.21వేలు నుంచి రూ.26వేలు వరకు జీతాలు చెల్లిస్తారని చెప్పారు. పది రాష్ట్రాల విద్యార్థులకు ఈ సంస్థ సేవలు అందిస్తుందని చెప్పారు. సంస్థ డైరెక్టర్ రోనీలా కార్లో, సంజయ్ సుబ్రహ్మణ్యం, సోమప్ప, భాషా, క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్ కొలసాని రాంచంద్ అభినందించారు.

మైనార్టీలకు రాయితీ రుణాలు అభినందనీయం: మోసిగంటి

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మైనారిటీలకు రాయితీ రుణాలు అందించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమని జీసస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ ఛైర్మన్ ప్రొఫెసర్ జోసెఫ్ మోసిగంటి గురువారం అన్నారు. ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల ద్వారా 49218 మంది మైనార్టీలకు లబ్ధి చేకూరుతుందన్నారు. గత వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి ఒక్కరికి కూడా స్వయం ఉపాధి రుణాలు అందించలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలో స్వయం ఉపాధి కోసం 326కోట్లు బడ్జెట్లో కేటాయింటంపై హర్షం వ్యక్తం చేశారు. లబ్ధిదారులకు రూ.8లక్షల యూనిట్ల వరకు ప్రభుత్వం రుణం మంజూరు చేస్తుందన్నారు. దీనికి అనుగుణంగా ఉపాధి అవకాశాలును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శివరాత్రికి పటిష్ఠ ఏర్పాట్లు

రేపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి నేపథ్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు జిల్లాలోని పలు శివాలయాల్లో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్లు దేవదాయ శాఖ డీసీ కేబీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అరవపల్లి బాలకోటేశ్వర స్వామి దేవాలయం, కొల్లూరు మండలం కోటిపల్లి సోమేశ్వరస్వామి దేవాలయాలను గురువారం ఆయన సందర్శించారు. దేవాలయాల సమీపంలో చలువ పందిళ్ళు క్యూలైన్ల కోసం బారీగేట్లు, భక్తులకు తాగునీరు, అభిషేకం చేసుకునేవారికి తగిన వసతులు కల్పించాలని సూచించారు.

సిమెంటు రోడ్డుతో తొలగిన ఇక్కట్లు



గతంలో బురదమయంగా ఉన్న రోడ్డుపై వాహనచోదకుల అగచాట్లు (ఫైల్ ఫొటో)



కూటమి ప్రభుత్వంలో నూతనంగా వేసిన సీసీరోడ్డు

● పూర్తయిన కొలకలూరు రైతు సేవా కేంద్రం, శ్మశాన వాటిక రోడ్డు
● గ్రామస్థుల్లో హర్షాతిరేకాలు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరు రైతుసేవాకేంద్రం, శ్మశాన వాటికకు వెళ్లే రహదారి సీసీరోడ్డు పూర్తయింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ రోడ్డు పల్లంగా ఉంటూ చిన్నపాటి వర్షం కురిస్తే బురదమయంగా మారి మోకాళ్లకు పైగా నీరు నిలిచి అందులో వెళ్లేందుకు రైతులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రైతుసేవా కేంద్రం ఇదే రోడ్డులో ఉండటంతో యూరియా, డీఏపీ, ఇతర పంట రసాయనాలు తీసుకునేందుకు వచ్చె రైతులు రోడ్డు సరిగా లేకపోవడంతో ఆ ఎరువుల బస్తాలను తలపై పెట్టుకుని మోసుకుంటూ వెళ్లే పరిస్థితి ఉండేది. శ్మశాన వాటికకు కూడా ఇదే మార్గం కావడంతో గ్రామంలో ఎవరైనా చనిపోతే అంతిమ సంస్కారాలు జరిపేందుకు మృతదేహంతో వెళ్లేవారు సైతం మోకాలి లోతు బురదతో తీవ్ర ఇబ్బందులు చవిచూసేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామంలో ఆ రోడ్డు దుస్థితిని గ్రామస్థులు మంత్రి మనోహర్ దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే స్పందించిన మనోహర్ సీసీ రోడ్డుకు నిధులు కేటాయించారు. బురదమయంగా ఉండే రోడ్డు సిమెంట్ రోడ్డుగా మారి రైతులకు, శ్మశాన వాటికకు వెళ్లేవారికి, ప్రజలకు ఇబ్బందిలేకుండా మార్గం సుగమమవటంతో గ్రామస్థుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి, మంత్రి మనోహర్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

కొనసాగుతున్న సదరం రీవెరిఫికేషన్

అర్హత లేనివారి వద్ద ఆపరేటర్ల చేతివాటం



సదరం రీవెరిఫికేషన్‌కు వచ్చిన వారి వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

తెనాలి రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహిస్తున్న సదరం రీవెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో సర్టిఫికెట్ పొందేందుకు అర్హత లేకపోయినా అధికారాన్ని ఉపయోగించి పలువురు సదరం సర్టిఫికెట్‌లు పొంది పింఛన్లు తీసుకుంటున్నట్లు ఆరోపణలు రావడంతో కూటమి ప్రభుత్వం రీవెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టింది. అయితే ఈ ప్రక్రియలో వైద్యులు వైకల్యశాతాన్ని సక్రమంగా నమోదు చేస్తున్నా కొందరు ఆన్‌లైన్ ఎంట్రీ ఆపరేటర్లు అర్హతలేని వ్యక్తుల వద్ద డబ్బు తీసుకుని ఆన్‌లైన్‌లో వైకల్యశాతాన్ని మారుస్తున్నట్లు పలువురి నుంచి ఆరోపణలు వినిపిస్తున్నారు. నిత్యం పట్టణ వైద్యశాలకు నిజమైన అర్హులు వస్తుండగా వైకల్యశాతం లేని వారు గతంలో సర్టిఫికెట్ పొందేందుకు వైద్యశాలలో సహకరించిన వారిని సంప్రదించి వారికి అడిగినంత ముట్టజెప్పి సర్టిఫికెట్‌లో యథావిధిగా వైకల్యశాతం నమోదు చేయించుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పెద్దసంఖ్యలో అనర్హులకు సర్టిఫికెట్‌లు జారీ అయ్యేలా ఏర్పాటుచేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నట్లు వస్తున్న ఆరోపణలపై ఉన్నతాధికారులు దృష్టిపెట్టి నిజమైన అర్హులకే పింఛన్ సాయం అందేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

పరిశీలించిన డీఆర్‌డీఏ పద్మ

పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహిస్తున్న సదరం సర్టిఫికెట్‌ల రీవెరిఫికేషన్ ప్రక్రియను బాపట్ల జిల్లా డీఆర్‌డీఏ పీడీ పద్మ గురువారం పరిశీలించారు. వెరిఫికేషన్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని సూచించారు.

ఆలస్యంగా ప్రారంభమైన కంటి వైద్య శిబిరం

తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో సదరం రీవెరిఫికేషన్ ప్రక్రియలో భాగంగా కంటి విభాగ సేవలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. దీంతో రీవెరిఫికేషన్ కోసం వచ్చినవారు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

ఎమ్మెల్సీగా ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బీటీ నాయుడు, తదితరులు

● ఆదోని ఎమ్మెల్సీ బీటీ నాయుడు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఎమ్మెల్సీ ఎన్నికల తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఆదోని ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు కృష్ణా, గుంటూరు ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు అవకాశం కల్పించారన్నారు. ఆలపాటి మంచి వ్యక్తిత్వం కలిగిన నేతగా ప్రజల మన్ననలు పొందారన్నారు. ఈ ప్రాంతంలో పట్టభద్రులందరి ఓట్లు చేర్పించడంలో కూటమి శ్రేణులు గతంలో కంటే మిన్నగా పనిచేశారని వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆలపాటిని ఎమ్మెల్సీగా గెలిపించుకుంటే జరిగే మంచిని ప్రజలందరికీ వివరించాల్సిన బాధ్యత కూడా కూటమి శ్రేణులపైనే ఉందన్నారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ గుంటూరులో శుక్రవారం ఉదయం 10:30కి నామినేషన్ వేయనున్నారని, ఆయనకు మద్దతు తెలుపుతూ పెద్ద సంఖ్యలో కూటమి శ్రేణులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీరని అన్యాయం జరిగిందని కూటమి ప్రభుత్వం వాటన్నింటిని సరిచేసుకుంటూ వస్తున్నదని తెలిపారు. ఎమ్మెల్సీగా ఆలపాటిని గెలిపించుకుంటే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కోసం పని చేయడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్ల సమస్యల పరిష్కారానికి పెద్దల సభలో తన గళం వినిపించి మంచి జరిగేలా చూస్తారని వివరించారు. ఆలపాటిని కుల, మత, రాజకీయాలకు అతీతంగా అందరూ ఆదరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరరావు, మహమ్మద్ ఖుద్దుస్, జొన్నాదుల మహేష్, కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ మంగమూరి హరిబాబు, కనకరాం బాబు, ఈదర వెంకటపూర్ణచంద్, రావి చిన్ని, కంచర్ల ఏడుకొండలు, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, ముళ్లపూడి వెంకట్, మల్లవరపు విజయ్‌కుమార్, అశోక్, భాగ్యరాజు, పలువురు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకంపై శ్రద్ధ తీసుకోవాలి

● ఎంఈవో సాల్మన్‌రాజు



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో సాల్మన్‌రాజు

కొల్లిపర, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంపై ప్రధానోపాధ్యాయులు తగిన శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. గురువారం మండల పరిధిలోని హనుమాన్‌పాలెం ప్రాథమిక పాఠశాలను ఎంఈవో తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుపట్టీని, మధ్యాహ్న భోజన పథకంను సక్రమంగా అమలు చేస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు వంట వండే విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, అజాగ్రత్త వహిస్తే వారిపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. నిబంధనల ప్రకారం ఆహార పదార్థాలు పిల్లలకు ఇవ్వాలన్నారు. విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన విద్యను అందించాలన్నారు. విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. ప్రతి పాఠశాలలోను ఉపాధ్యాయులు పారిశుద్యంపై శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాలల్లో సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ కిరణ్

ప్రకృతి వ్యవసాయంతో భావితరాలకు సంపూర్ణ ఆరోగ్యం

● ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ కిరణ్


కొల్లిపర, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం చేసి భావితరాలకు మంచి ఆరోగ్యాన్ని అందివ్వాలని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ కిరణ్ అన్నారు. గురువారం మండల కేంద్రం కొల్లిపరలో సోలార్ రైస్ మిల్లుపై జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. కార్యక్రమానికి ప్రకృతి వ్యవసాయాధికారి మాధవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా వరిని పండిస్తున్న రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండటం కోసం ప్రకృతి వ్యవసాయ సంస్థ ఆల్టో కంపెనీ సాయంతో సోలార్ రైస్‌మిల్లును అందుబాటులోకి తీసుకురావటం జరిగిందన్నారు. ఈ సోలార్ రైస్‌మిల్లును ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ అడిషనల్ డీపీఎం సత్యనారాయణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ధాన్యాన్ని ప్రాసెసింగ్ చేసుకుని నాణ్యమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. వీటిని ఆహారంగా తీసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జిలు నాగజ్యోతి, సుధారాణి, ఎంటీ రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న తదితరులు

డ్రెయిన్ల నిర్మాణ పనుల పరిశీలన

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న పరిశీలించారు. గురువారం స్థానిక గంగానమ్మపేటలో జరుగుతున్న డ్రెయిన్ల నిర్మాణ పనులను మునిసిపల్ కమిషనర్ శేషన్న క్షేత్రస్థాయిలో అధికారులతో కలసి పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోపు పూర్తిచేయాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో రోడ్డు విస్తరణ, సైడు కాలువల నిర్మాణాలను చేపట్టామన్నారు. ప్రజలు కూడా సహకరించాలని కోరారు. అనంతరం పట్టణంలో పలు ప్రాంతాలలో ఉన్న పార్కులను సందర్శించి వాటి నిర్వహణలో ఉన్న సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ శ్రీనివాసులు, ఏఈ సూరిబాబు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న అధికారులు

మహాశివరాత్రి ఉత్సవాలను వైభవంగా జరిపిద్దాం

● ఈవో లీలాకుమార్ ● ఉత్సవాల గోడపత్రికల ఆవిష్కరణ

పెదకాకాని, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహా శివరాత్రి కల్యాణ ఉత్సవాలను వైభవంగా జరిపిద్దామని అధికారులు సమష్టిగా నిర్ణయించారు. గురువారం శివాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆలయ ఈవో గోగినేని లీలాకుమార్ అధ్యక్షతన మహాశివరాత్రి ఏర్పాట్లపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లీలాకుమార్ మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాలను ఈ నెల 23 నుంచి మార్చి ఒకటో తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తామన్నారు. అందుకు అన్ని శాఖల అధికారులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ప్రత్యేకంగా శానిటేషన్, ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని కోరారు. ఈ నెల 26న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల వరకే అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణకాంత్, ఎంపీడీవో రమావత్ శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, ఎస్ఐ మిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మున్నంగిలో ఇసుకరీచ్‌ని పరిశీలిస్తున్న అధికారులు

సాయంత్రం 6గంటలకు ఇసుకరీచ్‌ల మూసివేత

కొల్లిపర, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన ఇసుకరీచ్‌లన్నింటిని గురువారం సాయంత్రం 6గంటలకు తహసీల్దార్ సిద్ధార్థ, ఎస్ఐ కోటేశ్వరరావుతో కలిసి మూసివేయించారు. మండల పరిధిలోని మున్నంగి, పిడపర్తిపాలెం, బొమ్మువానిపాలెం ఇసుకరీచ్‌ల్లో రెవెన్యూ, పోలీసు సిబ్బందిని ఏర్పాటుచేసి సాయంత్రం ఆరు గంటల సమయానికి లారీలను ఇసుక డంపింగ్ దగ్గరకు వెళ్ళకుండా నిలిపివేయించారు. ఇసుకను లోడింగ్ చేసే పొక్లెయిలను డంపింగ్ దగ్గర నుంచి బయటకు పంపించారు. పోలీసులను, వీఆర్వోలను ఇసుకరీచ్‌ల వద్ద 24గంటలు ఉండేలా ఏర్పాటు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ రమేష్ బాబు

నూరుశాతం పన్నులు వసూలు చేయాలి

● మునిసిపల్ కమిషనర్ రమేష్ బాబు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో ఇంటి పన్నులు తాగునీటి కుళాయిల పన్నులు నూరుశాతం వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు ఆదేశించారు. మునిసిపల్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో కమిషనర్ రమేష్ బాబు మాట్లాడుతూ ఈ ఏడాది రూ.5.70కోట్ల ఆస్తి పన్ను డిమాండ్ ఉన్నట్లు చెప్పారు. ఇప్పటివరకు రూ.3.48 కోట్ల పన్నులు వసూలు చేసినట్లు చెప్పారు. మిగిలిన రూ.2.21కోట్ల ఆస్తి పన్ను, నీటి కుళాయి పన్ను రూ.91 లక్షలు ఉన్నట్లు చెప్పారు. నూరుశాతం పన్నులు వసూలు చేసి పురపాలక సంఘం అభివృద్ధికి కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీశైల దేవస్థానం అధికారుల నుంచి ప్రశంసా పత్రాలు అందుకుంటున్న కూచిపూడి నృత్య కళాకారులు

చిన్నారుల నృత్య ప్రదర్శనకు ప్రశంసలు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో కూచిపూడి నృత్య శిక్షణ పొందుతున్న చిన్నారులు శ్రీశైల దేవస్థానం అధికారుల మన్ననలు అందుకున్నారు. శ్రీశైల దేవస్థానం ఆహ్వానం మేరకు పొన్నూరు పట్టణానికి చెందిన కూచిపూడి నృత్యం అభ్యసించిన చిన్నారులు శ్రీశైల దేవస్థానానికి చేరుకొని అక్కడ ఆలయంలోని కళావేదికపై నృత్య ప్రదర్శన చేశారు. చిన్నారుల ప్రదర్శనకు ఆలయ అధికారులు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా పొన్నూరు పట్టణంలో చిన్నారులకు కూచిపూడి శాస్త్రీయ నృత్య శిక్షణ ఇస్తున్న నటరాజ కూచిపూడి నాట్య నిలయం నిర్వాహకులు ఓంకారేశ్వరిని ప్రత్యేకంగా అభినందించారు.

మాజీ కౌన్సిలర్ స్థానక బాబు మృతి



మాజీ కౌన్సిలర్ స్థానక బాబు మృతదేహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ రూత్ రాణి

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిడుబ్రోలు 14వ వార్డు మాజీ కౌన్సిలర్ పగడాల స్థానకబాబు బుధవారం రాత్రి మృతి చెందాడు. స్థానక బాబు 2005లో కాంగ్రెస్ తరపున కౌన్సిలర్‌గా గెలుపొందారు. స్థానక బాబు మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ నల్లమోతు రూతురాణి పలువురు వైసీపీ నాయకులు మాజీ కౌన్సిలర్లు స్థానక బాబు మృతదేహాన్ని గురువారం సందర్శించి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.



విరాళాన్ని అందజేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయురాలు ఇంద్రావతి

పాఠశాలలో షెడ్డు నిర్మాణానికి రూ.లక్ష విరాళం

పెదకాకాని, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెనిగండ్ల వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు సహ ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన అవుతు ఇంద్రావతి పాఠశాలలో అభివృద్ధి పనులకు విరాళం అందించారు. ఈ మేరకు గురువారం రూ.లక్ష విరాళాన్ని పాఠశాలలో విద్యార్థులు భోజనం చేసేందుకు అవసరమైన భోజనశాల నిర్మాణానికి అందచేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నంబూరు తిరుపతిరావు, ఎస్ఎంసీ చైర్మన్ చాదరాజు వెంకటేశ్వరరావు, పాఠశాల సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

